జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 19, సెప్టెంబర్ 2024




జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 19, సెప్టెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## దీపావళి నుంచి ఉచిత సిలిండర్

- పండుగ రోజున మొదటి సిలిండర్ అందిస్తా
- సీఎం చంద్రబాబు ప్రకటన



**విజయవాడ, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ మహిళలకు సీఎం చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై కీలక కామెంట్స్ చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభిస్తామని చెప్పారు.పండుగ రోజున మొదటి సిలిండర్ అందిస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో హామి ఇచ్చినట్లుగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.



## ఇంకా పంచాయితీల 'సాక్షి'గా...

- పంచాయతీలకు ఇంకా సాక్షి పత్రిక
- ఓ కూటమి వచ్చిన తర్వాత ఆ నిర్ణయం రద్దు
- అయినా అమలు కాని సర్కారు ఆదేశాలు
- మంత్రివర్గ భేటీలో బాబు దృష్టికి తెచ్చిన మంత్రులు
- దానితో గ్రామ, వార్డు, సచివాలయ వాలంటీర్ల 200 రూపాయల కేటాయింపు రద్దు
- 'నిఘా' విభాగం మొద్దునిద్రపోతుందా?
- క్షేత్రస్థాయి నిజాలు తెలుసుకోదా?
- టీడీపీ సోషల్‌మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఇది జగన్ ప్రభుత్వమా? కూటమి ప్రభుత్వమా అని విసుర్లు

(మార్తి సుబ్రహ్మణ్యం)

జగన్ సర్కారులో ఆయన భార్య భారతీరెడ్డి చైర్మన్‌గా ఉన్న వైసీపీ అధికారపత్రిక సాక్షి పత్రిక.. ప్రతి పంచాయితీకి అధికారికంగానే వెళ్లేది. దానికి సర్కారు సొమ్మునే దానం చేసిన వైనం రచ్చయింది. అంటే వాలంటీర్లకు అదనంగా ఇచ్చిన 200 రూపాయల కేటాయింపును ప్రశ్నించింది. దానిపై టీడీపీ-జనసేన నేతలు భగ్గుమన్నారు. అసలు ప్రభుత్వ సొమ్మును సాక్షికి ఎలా నేరుగా ఇస్తారు? ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు కాకుండా వైసీపీ సాక్షినే ఎందుకు వేస్తున్నారంటూ దుయ్యబట్టింది.

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే, పంచాయితీలకు వేస్తున్న సాక్షి పత్రికను నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులిచ్చింది. దానితో పంచాయతీలకు సాక్షి పత్రిక నిలిచిపోయిందని చాలామంది భావించారు. కానీ ఇప్పటికీ సాక్షి పత్రిక పంచాయతీలకు వెళుతున్న వైనం, టీడీపీ సోషల్‌మీడియా సైనికుల కన్నెర్రకు గురయింది. దానితో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా, పంచాయతీలకు ఇంకా సాక్షి పత్రిక వెళుతోందన్న విషయం బయటకు పొక్కింది.

దీనిపై టీడీపీ సోషల్‌మీడియాలో ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు వెల్లువెత్తుతున్నాయి.' జగన్‌కు బుద్ధి లేదు.. మాకు సిగ్గు లేదు. రాష్ట్రంలో ఉన్నది జగన్ ప్రభుత్వమా? కూటమి ప్రభుత్వమా?.. ఇక మనం జగన్‌ను ఏమీ చేయలేం. అందుకే అతను ధైర్యంగా జనంలోకి వచ్చి, ప్రభుత్వంపై సవాళ్లు విసురుతున్నాడంటూ కామెంట్ల రూపంలో నిప్పులు కురిపిస్తున్నారు.

ఇదిలాఉండగా.. పంచాయితీలకు ఇంకా సాక్షి పత్రిక వెళుతోందంటూ.. మంత్రివర్గ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఏడాదికి 204 కోట్ల రూపాయలు, పంచాయితీలకు సాక్షి పేపర్ వేయించుకునేందుకు కేటాయించారు. దానికోసం వార్డు, గ్రామ, సచివాలయ వాలంటర్లీకు 200 రూపాయలు అదనంగా కేటాయించింది. అంటే ఆ డబ్బును వాళ్లే చెల్లిస్తారన్నమాట. మున్సిపాలిటీల్లో సైతం ప్రభుత్వ కార్యాలయాల్లో సాక్షి పత్రిక వేయించుకోవాలని తీర్మానం చేశారు.

అంతేకాదు. జగన్ ప్రభుత్వం ఒక్క సాక్షికే 480 కోట్ల యాడ్స్ ఇస్తే, మిగిలిన అన్ని పేపర్లకు 400 కోట్ల యాడ్స్ ఇచ్చింది. బిల్లులు కూడా సాక్షికే ఇచ్చుకుంది. ప్రభుత్వం మారినా ఇంకా పంచాయతీలకు సాక్షి పత్రిక రావడం ఏమటని' మంత్రులు, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

మిగతా.. 2లో

- 'ఇది మంచి ప్రభుత్వం'తో ప్రభుత్వం కార్యక్రమాలు ఇంటింటా వివరించాలి
- 20 నుండి 26 వరకు ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండాలి
- దీపావళి పండుగ కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్... త్వరలోనే మిగతా హామీల అమలు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నీ భయంకర పరిస్థితులే... అస్తవ్యస్థంగా ఆర్థిక వ్యవస్థ
- అన్నింటినీ చక్కదిద్దుతూ అడుగులు ముందుకు వేస్తున్నాం
- టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నా...
- ఎమ్మెల్యే, ఎంపీలు, ఎమ్మెల్సీ సమావేశంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్ ఆవిష్కరణ




## 100 రోజుల పాలన.... 1000 అడుగులు ముందుకు..!

'కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావొస్తోంది...ఈ వంద రోజుల్లో పాలనాపరంగా 1000 అడుగులు ముందుకు వేశాం. ఈనెల 20వ తేదీ నుండి 26 వరకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే వాటిని ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలి. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తే పాలన ఎలా ఉంటుందో ఈ 100 రోజులు ఒక ఉదాహరణ.

11 లో




## జమిలి ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

- మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్
- 8 మంది సభ్యులతో కమిటీ

**ఢిల్లీ,మహానాడు:** కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై మాజీ రాష్ట్రపతి

మిగతా.. 2లో






## కొత్త మద్యం పాలసీకి ఆమోదం

- అక్టోబర్ మొదటి వారం నుంచి నూతన ఎక్సైజ్ పాలసీ అమలు
- చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు
- రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ, స్కిల్లింగ్ అకాడమీ ఏర్పాటు
- వాలంటీర్లు, సచివాలయాలకు దినపత్రికల కోసం నెలనెలా ఇచ్చే రూ.200/-జీవో రద్దు
- భోగాపురం ఎయిర్ పోర్టుకు "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం" గా నామకరణం
- ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫ్రాక్షన్ (స్టెమీ), రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాలు ప్రారంభం
- రూ.3 కోట్ల కార్పస్ నిధితో ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌సర్వీస్‌మెన్ కార్పొరేషన్ లిమిటెడ్ (APEXCO) ఏర్పాటు
- 1 నవంబర్, 2024న స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ విడుదల
- రైతు భరోసా కేంద్రాల పేరు మార్పు: - ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు
- సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

12 లో



మేము సైతం..

05



రాహుల్ గాంధీ హత్యకు కుట్ర!

10





చంద్రన్న 100 రోజుల పాలనకు వందనం

03



బీజేపీ కార్యకర్తలకు మోదీ బర్త్ డే 'తోఫా'

03



వరద బాధితులకు విరాళాలు

12

### మా ప్రభుత్వం గత ప్రభుత్వంలా

## గడీల మధ్య లేదు

- ఇది ప్రజల కోసమే పని చేసే ప్రజా ప్రభుత్వం
- ఎంఎంఈలు బలపడితేనే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఎంఎంఈ పాలసీ- 2024 ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:** రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఎంఎంఈ లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర సంపదను పెంపొందించాలనే ఎంఎంఈ పాలసీ-2024ను ఆవిష్కరించాం. దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్న పరిస్థితుల్లో, నాటి ప్రధాని పీవీ నరసింహారావు దూరదృష్టితో

మిగతా.. 2లో




### ఉగ్రవాదానికి బీజం వేస్తున్న

## మదర్సాలకు నిధులిస్తారా?

- భారతీయ సంస్కృతికి నిలయమైన శిశు మందిర్ లకు పైసలెందుకు ఇవ్వరు?
- నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు పట్టించుకోరు?
- దేశ చరిత్రను వక్రీకరిస్తూ విదేశీ భావజాలాన్ని పెంచిపోషిస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టులు
- శిశు మందిర్‌లు లేకుంటే సమాజమే నిర్వీర్యమయ్యే ప్రమాదం
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్...
- జమ్మికుంటలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయ నూతన హాస్టల్ బ్లాక్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి




**కరీంనగర్,మహానాడు:** ఉగ్రవాదానికి బీజం వేస్తున్న మదర్సాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తుండటం శోచనీయమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "చీపురపుల్లతో సైతం ఏకే 47లు తయారు చేసేంతటి శిక్షణనిస్తూ ఉగ్రవాదాన్ని పోషిస్తూ దేశ భద్రతకు ముప్పుగా పరిణమించిన మదర్సాలకు ప్రభుత్వాలు

మిగతా.. 2లో

## కా'రణ' జన్ముడు.. నరేంద్రుడు!

(చాడ శాస్త్రి)

భార్య బాధ్యత లేదు..

పిల్లలు లేరు..

కుటుంబ బాధ్యతలు లేవు... పోగేసుకోవాలి అనే యావ లేదు..తరువాత తరం వాడికి తన పదవి ఎలా ఇవ్వాలి అనే తాపత్రయం లేదు.

ఉన్నది ఒకటే కోరిక..ఒకటే ధ్యాస...

నా భారత్ ని విశ్వగురువు ఎలా చేయాలి? ఎన్ని అడ్డంకులు ఎదురైనా...

ఎన్ని విమర్శలు వచ్చినా...ఎన్ని తిట్లు తింటున్నా... ఉన్న సమయం అంతా, జీవితం అంతా దేశానికి అంకితం. ఇది కదూ నిస్వార్ధ దేశభక్తి...ఇది కాదూ దేశానికి తనువు అర్పించడం అంటే?!


ఏ శతాబ్దాలకో ఒకరు పుడతారు.ఆ సమయంలో మనం ఉండటం మన అదృష్టం. గుర్తించలేని వారి దురదృష్టం. రాజకీయాల్లో అడుగుపెట్టిన దగ్గర నుండి రాజయోగమే. మన వంటి వారు గుర్తించడంలో ఆలస్యం.

నేను 20 సం. ల క్రిందట ఈ వ్యక్తి గురించి పూర్తిగా అధ్యయనం చేసి అతని గొప్పతనం గుర్తించాను. ఎందుకు ఇతని గురించి అధ్యయనం చేయవలసి వచ్చింది అంటే.. బహుశా అది 2000 సం. లో అనుకుంటా. విశాఖపట్టణంలో ఎక్కిరాల కృష్ణ మాచారి గారి ఆధ్యాత్మిక పత్రిక "మిహిర" నూతన సం. ఫలాలు రాస్తూ... రాబోయే దశాబ్దాల లో భారత్ విశ్వ గురువు అవుతుంది అంటూ రాసింది.

అంతే కాదు, దేశానికి పెద్దగా పరిచయం లేని, పశ్చిమానికి చెందిన, వివేకానంద పేరు స్ఫురించేలా ఒక వ్యక్తి అకస్మాత్తుగా దేశ రాజకీయాల్లో కి వస్తాడు, అతను దేశ అత్యున్నత పదవి అలంకరిస్తాడు, కనీసం 10 సం. లు పదవిలో ఉంటాడు. అతను పదవి లోంచి దిగే సమయానికి ,భారత్ ని ప్రపంచం విశ్వ గురువుగా గుర్తిస్తుంది అని రాశారు.

అప్పట్లో అటువంటి వ్యక్తి కోసం చూస్తే నాకు నరేంద్రుడు లో ఆ చెప్పిన లక్షణాలు పూర్తిగా ఉన్నాయి అని కనిపించింది. అందుకే అప్పటి నుండి మోదీ గురించి అంటే, ఆయన వ్యక్తిత్వం, ఆయన కుటుంబ నేపథ్యం, ఆర్ఎస్ఎస్ లో ఆయన ఎదుగుదల ఇలా చాలా విషయాలు మీద నేను మోదీ గురించి తెలుసుకున్నాను. అప్పుడే తెలిసింది నాకు ఇతను ఒక పని రాక్షసుడు, ఒకే లక్ష్యం తో, చిత్త శుద్ధి తో పనులు మొదలు పెట్టి ఇచ్చిన బాధ్యత పూర్తి చేస్తాడు అని.

ఆ తర్వాత కాలంలో ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి కావడం,



అయిన కొద్ది రోజుల్లోనే భయంకరమైన భూకంపం కచ్ ప్రాంతంలో వచ్చి సర్వ నాశనం అవ్వడం జరిగింది. దాని పునరుద్ధరణ పనులు ఒక వైపు చేస్తూ ఉండగానే, 2002 గోద్రా అల్లర్లు, ఆయన మీద ముప్పేట దాడులు, న్యాయస్థానంలో వ్యాజ్యాలు . ఒక వైపు వీటిని సమర్ధవంతంగా ఎదుర్కొంటూ ఎవరూ ఊహించని వేగంగా గొప్పగా కచ్ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు.

విద్యుత్ కోతలతో సతమతమవుతున్న రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చారు. స్త్రీలోలుడైన చిచి నెహ్రూ సమయం లో మొదలు అయ్యి, దశాబ్దాలుగా సాగుతున్న మరియు మేధా పాట్కర్ వంటి వారిని ఎదుర్కొంటూ నర్మదా ఆనకట్ట నిర్మాణ పనులు వేగవంతం చేసారు.

మోదీ ముఖ్యమంత్రి అయిన దగ్గర నుండి, నేను ఆయన కార్యకలాపాలు గమనించడం ఇంకా ఎక్కువ అయింది. 2014 నుండి మరీ ఎక్కువ అయింది. ఒక రాజకీయ నాయకుడిని ఇంతలా అభిమానించి, నా సమయం ఖర్చు చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఆయన్ను అంతగా అభిమానించి ఆయనకు మద్దతు ఇవ్వడానికి, నా సమయం వెచ్చిస్తున్నందుకు ఏ నాడూ నేను బాధపడే పరిస్థితి ఈ 24 సం.లలో కలగ లేదు. నా అంచనా తప్పు కాలేదు.

'ఖలేజా' చలనచిత్రంలో ఒక సంభాషణ ఉంటుంది.

"అద్భుతం జరిగే ముందు ఎవరు గుర్తించలేరు.జరిగిన తర్వాత గుర్తించాల్సిన అవసరం లేదు" అని. మోదీ విషయం లో ఇదే నా అభిప్రాయం.

అప్పుడు ఆ జ్యోతిష్యులు చెప్పిన విధంగా,

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||


## కా'రణ' జన్ముడు.. నరేంద్రుడు!

మొదటి పేజీ తరువాయి..

మోదీ ప్రధాన పదవి అలంకరించడం, ఆ పదవిలో 10సం.లు దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం కూడా జరిగింది.

కానీ, తరువాత ఏంటి? అని ఒక ప్రశ్న నా మెదడులో ఉంటే నిన్ననే ఒక విషయం తెలిసింది.

ఒక జ్యోతిష్యులు మోదికి జగదాంబ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి అని చెప్పారు. ఆయనే 2014లో, 2019లో కూడా మోడీకి సుమారు 300 సీట్లు వస్తాయి అని చెప్పారు. ఈ సారి ఎన్నికల్లో మళ్ళీ మోదీ ప్రధాని అవుతారు అని చెప్పారు. మరో ఆసక్తికరమైన విషయం ఏం చెప్పారు అంటే... 2001లో శని వృషభరాశి ని దాటినప్పుడు, మోదీజీ రాజకీయ శక్తి ప్రయాణం ప్రారంభమైంది అని, శని మహరాజ్ తన స్వంత 30 సంవత్సరాల చక్రాన్ని పూర్తి చేసుకుని, వృషభానికి ఎప్పుడు తిరిగి వస్తాడో అప్పుడు మోదీ పదవి త్యజిస్తారు అని చెప్పారు.

శని వృషభంలో సంచరించడం, రాజకీయ శక్తిలో మార్పుకు ప్రసిద్ధి చెందిందిగా చెప్ప బడుతుందట.

ఆయన లెక్క ప్రకారం మోదీ రాజకీయ ప్రయాణం

07.10.2001లో ప్రారంభం అయింది. అక్కడ నుండి 30 సం. లు అంటే 2031 వరకు ఆయనే పదవిలో ఉంటారు. జగదాంబ ఆదేశానుసారం బహుశా అక్టోబర్ 2030 నుండి జూన్ 2031 కాలంలో ఆయన పదవి వదిలేస్తారు అని చెప్పారు. కొందరు జ్యోతిష్యుల ప్రకారం 2026-27 మధ్య ప్రధాన పదవి నుండి తొలగి రాజకీయ సన్యాసం తీసుకుంటారు అని చెబుతున్నారు. చూడాలి..ఎవరి జ్యోతిష్యం నిజం అవుతుందో.

74 సం. లు నిండి 75లో అడుగుపెడుతున్న దామోదర్ దాస్ నరేంద్ర మోదీ కి, ఆ జగదాంబ ఆశీస్సులు పుష్కలంగా ఉండాలి. చివరి వరకు ఆయురారోగ్యాలతో భరత మాత సేవలో తరించాలి.



ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.20లక్షలు విరాళం అందజేసిన టెక్నో పెయింట్స్..జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్ అందజేసిన టెక్నో పెయింట్స్ డైరెక్టర్స్ ఆకునూరి శ్రీనివాస్ రెడ్డి, సీవీఎల్ఎన్ మూర్తి, అనిల్ కొండోత్.



ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50వేలు విరాళం అందజేసిన కుమారీ ఆంటీ..



విజయవాడ వరద సహాయక చర్యల నిమిత్తం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కలిసి తన పాకెట్ మనీ నగదు రూ. 72,500 అందజేసిన పులివెందులకు చెందిన ఒకటో తరగతి విద్యార్థిని ఎం.వర్ణిక.తన బాబాయి జి.ప్రణీత్‌కుమార్‌తో కలిసి నగదు సాయం అందజేసిన వర్ణిక, చిన్నారిని అభినందించిన వైఎస్ జగన్




అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెనార్స్ ఆఫ్ ఇండియా ALEAP ముఖ్యమంత్రి సహాయ నిధికి 5 లక్షల రూపాయల విరాళం అందించింది. ALEAP అధ్యక్షురాలు కన్నెగంటి రమాదేవి గారు, ఉపాధ్యక్షురాలు అడుసుమిల్లి దుర్గా భవాని, సంయుక్త కార్యదర్శి పల్లవి జోషి MSME పాలసీ -2024 ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి ఆ మేరకు చెక్కును అందించారు.

# జగన్‌కు మామ బాలినేని ఝలక్

- వైసీపీలో బాలినేని బాంబు
- వైసీపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- అవమానాల పాలయ్యానంటూ బాలినేని ఆవేదన
- జనసేనలో చేరికకు రంగం సిద్ధం
- పవన్‌తో భేటీ తర్వాత అధికార ప్రకటన
- బాలినేని రాజీనామాతో ప్రకాశంలో వైసీపీ ఖాళీ
- అజాతశత్రువు బాలినేని నిష్క్రమణతో 'ప్రకాశం' వైసీపీలో అంధకారం
- బాలినేనికి చెక్ పెట్టేందుకే చెవిరెడ్డిని దింపిన జగన్
- బాలినేని హెచ్చరికలు పట్టించుకోని జగన్
- వైవి సుబ్బారెడ్డితో బాలినేనికి చెక్ పెట్టే జగన్ ఎత్తుగడ బూమెరాంగ్
- మామనే ముంచిన జగన్ అల్లుడు
- జగన్ నియంతృత్వం భరించలేకనే నిష్క్రమణ
- బాలినేని రాజీనామాతో ఉమ్మడి ప్రకాశంలో వైసీపీ ఉక్కిరిబిక్కిరి

(మార్తి సుబ్రహ్మణ్యం)

బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఏపీ రాజకీయాలు తెలిసిన వారికి పరిచయం అవసరం లేని పేరిది. ఆయన అజాత శత్రువు. పార్టీలకు అతీతంగా ఆయనకు అంతా అభిమానులే. కష్టం ఉందని తెలిస్తే వారివద్దకే నేరుగా వెళ్లడం ఆయన నైజం. తనతో పని ఉందంటే.. కారు ఆపి మరీ బాధితుడి దరఖాస్తుపై, కారుదిగి సంతకం పెట్టేంత మాస్‌లీడర్ ఆయన. అందుకే శీనన్నంటే అందరికీ ఇష్టం.




అన్ని పార్టీలనేతలకు ఆయన అందరివాడు. అందుకే ఆయనంటే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బోలెడు క్రేజు. మోజు. పైగా ఆయన వైసీపీ అధినేత జగన్‌కు మామ వరస. అయినా దేని లెక్క దానిదే. నీ యవ్వారం సరిగ్గా లేదు అల్లుడూ అని నిర్మొహమాటంగా, అల్లుడు జగన్‌ను హెచ్చరించేంత చనువు. నీ నిర్ణయాల వ ల్ల మేమంతా నష్టపోయామని నిక్కచ్చిగా, అల్లుడినే కడిగేసేంత ధైర్యం ఆయన సొంతం.

అంత ఇమేజ్ ఉన్న బాలినేని.. ఇప్పుడు తన అల్లుడు జగన్ పార్టీ ఫ్యాను రెక్కలు పెడవిరిచి, జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఫలితంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసీపీకి నడిపించే నేతకు దిక్కులేని దుస్థితి. ఒక్క ముక్కల్లో చెప్పాలంటే.. ఉమ్మడి ప్రకాశం



జిల్లాలో వైసీపీకి దిక్కు దివాణం లేని విషాదం.

బాలినేని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, తన నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తానని హామీ ఇచ్చారు. అందుకు భూసేకరణకు 70 కోట్లు అవసరం. దానికోసం ఏళ్ల తరబడి జగన్, ఆయన కార్యదర్శి ధనంజయరెడ్డి చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. ఎన్నికల ముందు ఆ నిధులు విడుదల చేస్తున్నట్లు జీఓ ఇచ్చారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. జగన్ అపాయింట్‌మెంట్ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం శూన్యం. అయితే ధనంజయరెడ్డి, లేకపోతే సజ్జల. అదీ అప్పట్లో బాలినేనికి మిగిలిన అవమానం.

పుండుమీద కారం చల్లినట్లు.. చిత్తూరు జిల్లాకు చెందిన చెవిరె డ్డి భాస్కరరెడ్డికి ఒంగోలు ఎంపీ టికెట్ ఇవ్వడం బాలినే ని ఆగ్రహానికి గురిచేసింది. మాగుంట శ్రీనివాసరెడ్డికి ఒంగోలు ఎంపీ వైసీపీ సీటు, శిద్దా రాఘవరావుకు దర్శి సీటు ఇవ్వాలన్నది బాలినేని డిమాండ్ . చివరకు ఒంగోలు నుంచి 5 సార్లు ఎమ్మెల్యే, 2 సార్లు మంత్రిగా పనిచేసిన బాలినేనినే.. మార్కాపురం నుంచి పోటీ చేయాలని జగన్ ఇచ్చిన ఆదేశాలు, అల్లుడిపై మనసు విరిగేందుకు కారణమయ్యాయి. వైఎస్ జమానా నుంచి ప్రకాశం జిల్లాను శాసించిన బాలినేనిని రాజకీయంగా బలహీనపరిచి.. ఆయనతో ఉన్న శిద్దా రాఘరరావు కుటుంబానికి, ఒంగోలు సీటు ఇస్తానన్న జగన్.. విభజించి పాలించే రాజకీయంపై బాలినేని ఉలిక్కిపడిన వైనం.

అధికారం కోల్పోయిన తర్వాత సైతం.. తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వని అవమానాన్ని బాలినేని భరించలేకపోయారు. రాజకీయాలు తెలియని సజ్జల, విజయసాయిరెడ్డితో తనతో జగన్ మాట్లాడించడాన్ని బాలినేని అవమానంగా భావించారు. పైగా తన భిక్షతో రాజకీయాల్లోకి వచ్చిన.. మాజీ మంత్రి విడదల రజనీని దూతగా పంపిన జగన్ అహంకారం, బాలినేని ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ఫలితంగా తాను వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జనసేనాధిపతి పవన్ భేటీ తర్వాత, ఆయన జనసైనికుడి అవతారం ఎత్తనున్నారు. దీనితో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైసీపీ అనాధగా మార నుంది.

# ఉగ్రవాదానికి బీజం వేస్తున్న మదర్సాలకు నిధులిస్తారా?

**మొదటి పేజీ తరువాయి..**

నిధులివ్వడం ఎంత వరకు సమంజసం? అదే సమయంలో భారతీయ సనాతన సాంప్రదాయాలను, సంస్కృతి ని పెంపొందిస్తూ విద్యను అభ్యసిస్తున్న సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలకు ప్రభుత్వం నిధులెందుకు ఇవ్వడం లేదు?"అని ప్రశ్నించారు.

కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయ నూతన హాస్టల్ బ్లాకును కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ సరస్వతి శిశు మందిర్ గొప్పతనంతోపాటు శిశు మందిర్ కు, కార్పొరేట్ స్కూళ్లకు మధ్య ఉన్న తేడాను వివరించారు.

దీంతోపాటు కార్పొరేట్ యుగంలో, విదేశీ విచ్చలవిడి సంస్కృతి కొనసాగుతున్న ఈ రోజుల్లో కూడా అన్నింటినీ అధిగమిస్తూ శిశు మందిర్ నిలబడి ఎదుగుతున్నందుకు అభినందించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, కార్పొరేట్ శక్తులు ఈ దేశ చరిత్రను వక్రీకరిస్తూ విదేశీ భావజాలం, సంస్కృతిని పెంపొందిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాటల్లోనే... తెలంగాణలో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 20 వేలకుపైగా స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నా పట్టించుకోవడం లేదని బండి సంజయ్ మండిపడ్డారు. మధ్యాహ్న భోజన బాధ్యత కూడా ప్రధానోపాధ్యాయులపైనే పెట్టారు. ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ శాఖకు విద్యా మంత్రి కూడా లేకపోవడం శోచనీయం.

భారతీయ సనాతన సాంప్రదాయాలను, సంస్కృతికి అనుగుణంగా విద్యను అభ్యసిస్తున్న ఏకైక పాఠశాల సరస్వతి శిశు మందిర్ మాత్రమే. దీంతోపాటు దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను, రాష్ట్రాల్లో ఎదురవుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు విద్యార్థులకు బోధిస్తూ సమకాలీన అంశాలపై అవగాహన కల్పిస్తున్న సంస్థ కూడా సరస్వతి శిశు మందిర్ మాత్రమే.

శిశు మందిర్‌లు లేకపోతే సమాజం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉంది. అట్లాంటి శిశు మందిర్ ల ఏర్పాటుకు ప్రభుత్వం నుండి సహకారం లేకపోవడం బాధాకరం. అదే ప్రభుత్వం ఉగ్రవాదానికి బీజం వేస్తున్న మదర్సాలకు మాత్రం భారీ ఎత్తున నిధులిస్తుండటం శోచనీయం. చీపురపుల్లతో ఏకే 47లు తయారు చేసేంతటి శిక్షణనిస్తూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న మదర్సాలకు నిధులివ్వడం ఎంత వరకు సమంజసం? నేను శిశు మందిర్ విద్యార్థినని గర్వంగా చెప్పుకోగలుగుతున్నా. నాతోపాటు మా అన్నయ్యలు, అక్క కూడా శిశు మందిర్ లోనే చదువుకున్నరు. 1 కోటి 30 లక్షల రూపాయలతో వ్యయంతో ఈరోజు గర్ల్స్ హాస్టల్ భవనం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. పూర్తి స్థాయిలో రెసిడెన్షియల్ స్కూల్ గా మారడంవల్ల దూర ప్రాంతాల నుండి కూడా ఇక్కడికి వచ్చి ఈ హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్నారు. కోరుట్ల, జగిత్యాల, సిరిసిల్లసహా ఉమ్మడి జిల్లాతోపాటు పొరుగు జిల్లాల నుండి ఇక్కడికి చదువుకుంటున్నారు. యోగా, శాఖ, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వ్యవసాయాన్ని కూడా నేర్పించడం ఈ స్కూల్ ప్రత్యేకత 1973లో ఇక్కడ సరస్వతి శిశు మందిర్ ప్రారంభమైంది. పదేళ్ల తరువాత 1983లో విద్యారణ్య ఆవాస కేంద్రాన్ని 41 మంది విద్యార్థులతో ఏర్పాటు చేసుకున్నరు.. ఆనాడు 4, 5, 6 తరగతులే ప్రారంభించుకున్నం. ప్రస్తుతం ఈ అవాస కేంద్రంలో 360 మంది బాలురు, 150 మంది బాలికలతో కలిసి మొత్తం 510 మంది విద్యార్థులకుపైగా చదువుకోవడం సంతోషంగా ఉంది. 1981లో అప్పటి జిల్లా కలెక్టర్ శర్మగారు ఈ కేంద్రం కోసం 20 ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారు. నాటి ప్రభుత్వ ధర చెల్లించి ఈ స్థలాన్ని కొనుగోలు చేశారు.

ఇక్కడ చదువుకున్న వాళ్లలో ఎంతో మంది డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్లు, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు, రాజకీయ నాయకులయ్యారు. విదేశాల్లో సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసుకుని ఎంతో మందికి ఉద్యోగాలు కల్పిస్తూ స్థిరపడ్డ వాళ్లు కూడా ఉన్నారు. సంతోషకరమైన విషయమేందంటే... శిశు మందిర్ లో చదువుకున్న వాళ్లు ఏ రంగంలో ఉన్నా సరే...జాతీయవాద భావజాలంతో పనిచేస్తుండటం చాలా సంతోషంగా ఉంది.

# ఇంకా పంచాయితీల 'సాక్షి'గా...

**మొదటి పేజీ తరువాయి..**

దానికి స్పందించిన చంద్రబాబునాయుడు, సాక్షిని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా సాక్షికి ఇచ్చిన ప్రకటనలపై విచారణ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. అందులో భాగంగానే గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగులకు నెలకు 200 రూపాయలు కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను, ఉప సంహరించుకునే ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించింది.

కాగా.. టీడీపీలో చేరిన మాజీ వైసీపీ సర్పంచులున్న పంచాయితీల్లో మాత్రం.. సాక్షిని నిలిపివేశారని, మిగిలిన పంచాయతీల్లో ఆ పద్ధతి కొనసాగుతున్నట్లు మహానాడు సర్వేలో వెల్లడయింది. ఎందుకంటే గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయలేదు. దానితో వైసీపీ సర్పంచులే ఏకగ్రీవం అయ్యారు. ఇప్పుడు ఆ పంచాయితీల్లోనే సాక్షి పత్రిక ఇంకా వ స్తోంది.

కాగా.. అసలు ఇవన్నీ ముందుగానే తెలుసుకుని, ప్రభుత్వాన్ని హెచ్చరించాల్సిన ఇంటలిజన్స్ వ్యవస్థ నిద్రపోతోందా? అన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

నిఘా విభాగం తన పని తాను చేస్తుంటే, తాము సోషల్‌మీడియాలో ఎక్కాల్సిన అవసరం ఎందుకుంటుందని టీడీపీ సోల్జర్స్ ప్రశ్నిస్తున్నారు.

'క్యాబినెట్ మీటింగ్‌లో మంత్రులు పంచాయతీలకు ఇంకా సాక్షి వస్తుందని చెప్పేవరకూ సీఎంకు తెలియదంటే,ఇంటలిజన్స్ ఎంతబాగా పనిచేస్తుందో అర్థమవుతోంది. ఇక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఏజీపీల నియామకంలో వైసీపీ వాళ్లనే నియమించారు. దానిపై కూడా నిఘా విభాగం సీరియస్‌గా తీసుకున్నట్లు లేదు. చంద్రబాబునాయుడై అలిపిరిలో జరిగిన దాడి కేసులో పిటిషనర్ల తరఫున వాదించిన రాజారావు కోడలికి పోస్టు ఇచ్చారు. వైసీపీ కోసం పనిచేసిన లాయర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా ఇస్తారు? టీడీపీ కోసం పోరాడిన వారిని పట్టించుకోరా? సార్‌కు ముఖ్యులనుకునే ఆ ఇద్దరు ఎవరిని సూచిస్తే వారినే స్టాండింగ్ కమిటీ, పీపీలుగా నియమిస్తారా? అంటే దానిపై విచారణ ఉండదా?' అని టీడీపీ సోషల్‌మీడియా సైనికులు దుయ్యబడుతున్నారు.

## జమిలి ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

**మొదటి పేజీ తరువాయి..**

రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికను కేబినెట్ బుధవారం మధ్యాహ్నం ఆమోదించింది. రానున్న శీతాకాల సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టనుంది.

కేంద్ర సర్కార్ వన్ నేషన్ - వన్ ఎలక్షన్ ప్రతిపాదన కోసం రామ్‌నాథ్ కోవింద్ సహా 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కమిటీ సభ్యులతో రామ్‌నాథ్ కోవింద్ చర్చించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల అభిప్రాయాలను, రాష్ట్రాల సవాళ్లను కమిటీ పరిశీలించింది.

సుదీర్ఘ చర్చోపచర్చల అనంతరం రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. జమిలి ఎన్నికల ప్రతిపాదన 1980లో వచ్చింది.

జస్టిస్ బీపీ జీవన్ రెడ్డి నేతృత్వంలోని లా కమిషన్ మే 1999లో తన 170వ నివేదికలో లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరగాలని అభిప్రాయపడింది. అందుకు తగినట్లే కేంద్రంలోని బీజేపీ సర్కార్ అధ్యయనానికి కమిటీ వేసి.. అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలను తీసుకుంది.

కోవిద్ సిఫార్సులు ఇవీ..

191 రోజుల సుదీర్ఘ అధ్యయనం తర్వాత...రాష్ట్రపతికి 18,626 పేజీల నివేదికను అందించిన కోవింద్ కమిటీ.

జమిలి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగంలోని ఐదు అధికరణల సవరణ ఆవశ్యకం.

ఆర్టికల్ 324A, 325 ప్రకారం ఓటర్ల జాబితా సవరణ తప్పనిసరి.

జమిలి ఎన్నిక లకు రెండంచల విధానం సిఫారసు.

మొదట లోక్‌సభ తో పాటు రాష్ట్రాల అసెంబ్లీలకు.

మొదటి దశ పూర్తైన వంద రోజుల్లోపు... రెండవ దశలో స్థానిక సంస్థల ఎన్నికలు.

ఏదేని కారణం చేత పార్లమెంట్ లేక అసెంబ్లీ నిర్ధారిత కాలపరిమితికన్నా ముందే రద్దు అయితే... మిగిలిన పదవీ కాలానికి మాత్రమే ఎన్నికలు జరగాలని సిఫారసు.

# మా ప్రభుత్వం గత ప్రభుత్వంలా గడీల మధ్య లేదు

**మొదటి పేజీ తరువాయి..**

వ్యవహరించారు.

పారిశ్రామిక విధానంలో సరళీకృత విధానాలు తీసుకొచ్చి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు. ప్రపంచంతో పోటీ పడేలా విధి విధానాలు తీసుకొచ్చారు. సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు గొప్ప ఆలోచన చేయడం అభినందనీయం. పాలసీ డాక్యుమెంట్ లేకుండా ఏ రాష్ట్రం అభివృద్ధి సాధించదు. అందుకే ఎంఎంఈ పాలసీ-2024 ను ప్రభుత్వం తీసుకొచ్చింది.

గత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తూనే... కొత్త పాలసీని ముందుకు తీసుకెళతాం.ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ.. అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజకీయాలు లేవు. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించింది. మంచి పనులు ఎవరు చేసినా వాటిని కొనసాగించడానికి మాకు అభ్యంతరం లేదు.

రాష్ట్ర ప్రయోజనానికి విఘాతం కలిగించే అంశాలను తొలగించేందుకు మా ప్రభుత్వం వెనక్కు తగ్గదు.ప్రస్తుతం చదివిన చదువుకు, పారిశ్రామిక అవసరాలకు మధ్య అంతరం ఏర్పడింది. అందుకే రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం..

టాటా ఇనిస్టిట్యూట్‌తో కలిసి సంయుక్తంగా రూ.2400 కోట్లతో ఆధునీకరిస్తున్నాం.పూర్తి అధ్యయనం తరువాత యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసాం. ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం అందించేలా యువతకు శిక్షణ ఇందులో శిక్షణ ఇవ్వనున్నాం.

యూనివర్సిటీ నిర్వహణకు పారిశ్రామిక వేత్తలు నుంచి రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నాం.

వీటిని యూనివర్సిటీ నిర్వహణకు ఖర్చు చేసేలా ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేసింది.ఇది రాజకీయ ప్రయోజనాల కోసం కాదు.రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి వ్యవసాయం పండగ అని నిరూపించాం..అయినా వ్యవసాయం ద్వారా వచ్చిన ఆదాయం రైతు కుటుంబానికి సరిపోవడంలేదు.

తెలంగాణ రైతాంగానికి ఈ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నా.



వ్యవసాయాన్ని వదలొద్దు.. అగ్రికల్చర్ అనేది మన కల్చర్. వ్యవసాయం చేసే వాళ్లు వ్యవసాయం చేస్తూనే ఇతర కుటుంబ సభ్యులను ఉపాధి అవకాశాలవైపు ప్రోత్సహించండి. వ్యాపారాల్లో రాణించేలా ఎదగాలి. హైదరాబాద్ లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం.

ఫ్యూచర్ సిటీలో లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా ఏర్పాటు చేయబోతున్నాం. మూసీ అంటే మురికి కోపం కాదు... మూసీ ని




మ్యాన్ మేడ్ వండర్ గా తీర్చిదిద్దబోతున్నాం. మా ప్రభుత్వం గత ప్రభుత్వంలా గడీల మధ్య లేదు. ఇది ప్రజల కోసమే పని చేసే ప్రజా ప్రభుత్వం. మా ప్రభుత్వంలో తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి.

అందరి సలహాలు, సూచనలు స్వీకరించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది.మా ప్రభుత్వం స్వయంసహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేసే ప్రయత్నం చేస్తోంది. శిల్పారామంలో 3 ఎకరాల స్థలంలో స్వయం సహాయక మహిళల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం సదుపాయం కల్పిస్తున్నాం..

అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో నిర్వహణ మహిళల చేతుల్లోపెట్టాం. మహిళా సంఘాలకే స్కూల్ యూనిఫామ్ కుట్టు పని బాధ్యతలు ఇచ్చాం. యూనిఫామ్ ధరను రూ.25 నుంచి రూ.75 చేసి ఆడబిడ్డలను ఆర్థికంగా ఆదుకుంటున్నాం.ఎంఎంఈ లు బలపడితేనే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఎంఎంఈ లకు మా ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

3

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||


ఓపిక్యాబినెట్‌కు ముందు తనకు ప్రజా దర్బార్‌లో వచ్చిన వినతులను సంబంధిత మంత్రులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని కోరిన మంత్రి నారా లోకేష్








# 2026 నవంబర్‌లో జమిలి ఎన్నికలు ?

- ఒకే దేశం.. ఒకే ఎన్నిక.. చరిత్ర ఇలా

(రవికుమార్)

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం మనది. ఇక్కడ ఎన్నికల నిర్వహణ కూడా ఎప్పుడూ ప్రత్యేకమే. సాధారణంగా భారత్‌లో కేంద్రానికి, రాష్ట్ర అసెంబ్లీలకు విడివిడిగా ఎన్నికలు జరుగుతుంటాయి. పార్లమెంట్‌కు, రాష్ట్రాల అసెంబ్లీలకూ ప్రతి ఐదేళ్లకు ఓ సారి ఎలక్షన్లు జరుగుతాయి.

అయితే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరగవు. శాసనసభ గడువు ముగిసే ఏడాది మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఏటా ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఈ కారణంతో అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతోందని, ప్రభుత్వ ఖర్చు పెరిగిపోతోందని కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా జమిలీ ఎన్నికలపై ఆలోచిస్తోంది.

ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుదీర్ఘ కాలంపాటు విచారించి14 మార్చి, 2024న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కమిటీ నివేదిక అందించింది. 18 వేల పేజీలకు పైగా ఉన్న ఈ నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్లకు ఒకే ఓటరు జాబితా సిద్ధం చేయాలని నివేదికలో సూచించారు.

2023, సెప్టెంబర్ 2న ఏర్పాటైన ఈ కమిటీ నివేదికను రూపొందించ డానికి 191 రోజులు పట్టింది. సెప్టెంబర్ 18, 2024న కేంద్ర కేబినెట్ జమిలీ ఎన్నికలు జరపడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మీకు తెలుసా.. జమిలీ ఎన్నికల ఆలోచన ఇప్పటిది కాదు. సుమారు 41 ఏళ్ల క్రితమే1983లో జమిలి ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

1983లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జరపాలని ఎన్నికల సంఘం సూచించింది. 1999లో లా కమిషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల చట్ట సంస్కరణలపై 170వ నివేదికను సమర్పించింది. 2018లో లా కమిషన్ ఆఫ్ ఇండియా జమిలీ ఎన్నికలపై నివేదిక విడుదల చేసింది.

15 ఆగస్టు, 2019 నాటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో దేశమంతటా ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట సాక్షిగా ప్రకటించారు. 1 సెప్టెంబర్, 2023న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 'ఒక దేశం, ఒకే ఎన్నిక'పై కమిటీ ఏర్పాటైంది. 2 సెప్టెంబర్ 2023న కమిటీ సభ్యులను ప్రకటించారు.

హోంశాఖ మంత్రి అమిత్ షా సహా ఏడుగురు సభ్యులు ఇందులో ఉన్నారు. వారిలో రామ్‌నాథ్ కోవింద్ కూడా ఒకరు. 23 సెప్టెంబర్ 2023న కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ అంశంపై ముందుగా అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకోవాలని సమావేశంలో



నిర్ణయించారు. రోడ్‌మ్యాప్‌కు సంబంధించి లా కమిషన్‌తో చర్చించి ముందుకు వెళ్లాలని కూడా నిర్ణయించారు.

మొత్తానికి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుని నివేదిక రూపొందించారని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం కూడా ఒకే చెప్పడంతో.. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్రాల ఎన్నికలు ఒకేసారి జరగనున్నా యన్నమాట.

# బీజేపీ కార్యకర్తలకు మోదీ బర్త్ డే 'తోఫా'



- ఎంపీ ఎన్నికల్లో 80 శాతానికిపైగా ఓట్లు నమోదు చేసినోళ్లకు బండి 'ప్రజాస్వామ్య కానుక'
- కరీంనగర్ ఎంపీ సెగ్మెంట్ లోని 222 పోలింగ్ బూత్ కమిటీలను ఘనంగా సన్మానించిన కేంద్ర మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అత్యధిక పోలింగ్ నమోదు చేయించాలని పిలుపు
- దేశంలోనే తొలిసారి కొత్త సాంప్రదాయానికి తెరదీసిన బండి సంజయ్

కరీంనగర్,మహానాడు:

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు వేడుకలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు బీజేపీ కార్యకర్తలకు 'ప్రజాస్వామ్య కానుక'ను అందించారు. అదేమిటంటే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో 80 శాతం అంతకంటే ఎక్కువ పోలింగ్‌ను నమోదు చేయించిన పోలింగ్ బూత్ కమిటీలను గుర్తించి ఘనంగా సన్మాంచారు. నగదు ప్రోత్సహకాన్ని సైతం అందించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో గత కొంత కాలంగా ఎన్నికల పోలింగ్ శాతం నానాటికీ పడిపోతుండటంతో ఒకవైపు ఎన్నికల సంఘం ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అనేక చర్యలు చేపట్టింది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. హైదరాబాద్, సికింద్రాబాద్ సహా నగరాలు, పట్టణాల్లో పోలింగ్ శాతం 50, 60 శాతం దాటడం లేదు.

ఇది గమనించిన బండి సంజయ్ మొన్నటి ఎంపీ ఎన్నికల సందర్భంగా "మీకు నచ్చితే ఏ పార్టీకైనా ఓటేయండి. అభ్యంతరం లేదు. కానీ తప్పనిసరిగా ఓటు మాత్రం వేయండి.' అని పిలుపునిచ్చారు. అదే సమయంలో బీజేపీ కార్యకర్తలకు బంపర్ ఆఫర్ ప్రకటించారు.

"నా పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా ఏ పోలింగ్ బూత్ లోనైతే 80 శాతం, అంతకుమించి ఓట్లు పోలవుతాయనే ఆ పోలింగ్ బూత్ కమిటీ బాధ్యులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు ప్రోత్సాహకంతోపాటు ఘనంగా సత్కరిస్తా"అని ప్రకటించారు.

ఈ నేపథ్యలో ఎన్నికల ఫలితాల అనంతరం ఏ పోలింగ్ బూత్ లో 80 శాతనికిపైగా ఓట్లు పోలయ్యాయనే వివరాలను సేకరించారు. ఒకటి రెండు కాదు... ఏకంగా 222 పోలింగ్ బూత్ లలో ఏకంగా 80 శాతం అంతకంటే ఎక్కువ ఓటింగ్ నమోదైనట్లు జాబితా రూపొందించారు. కొన్ని పోలింగ్ బూత్ లలో బీజేపీకి తక్కువ ఓట్లు పోలైనట్లు గుర్తించినప్పటికీ, వాటిని కూడా ఈ జాబితాలో చేర్చారు.

నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా బీజేపీ పక్షం రోజుల పాటు 'సేవా పఖ్వాడ' పేరిట అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈరోజు సాయంత్రం కరీంనగర్ లోని ఈఎన్ గార్డెన్ లో ఆయా పోలింగ్ బూత్ కమిటీ సభ్యులందరినీ పిలిపించి వారిని ఘనంగా సన్మానించారు.

నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించారు. బీజేపీ కార్యకర్తల కష్టం ఫలితంగానే తన పార్లమెంట్ పరిధిలో 222 పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక ఓట్లు పోలయ్యాయన్నారు. గత ఎన్నికల్లో తనను ఓడించాలని కేసీఆర్, రేవంత్ రెడ్డి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కువసార్లు పర్యటించారని, అయినప్పటికీ కార్యకర్తల శ్రమ ఫలితంగా 2 లక్షల 20 వేలకుపైగా మెజారిటీ వచ్చిందన్నారు.

వాస్తవానికి దేశంలో ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ కూడా పోలింగ్ శాతం పెంపుపై పెద్దగా ద్రుష్టి సారించలేదు. తమ పార్టీ అభ్యర్థి గెలిస్తే చాలనే భావనతో ప్రచారం చేసిన సందర్భాలే అనేకం ఉన్నాయి. కానీ ఏ పార్టీకైనా ఓట్లేయండి. కానీ ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అంటూ బండి సంజయ్ పిలుపునివ్వడమే కాకుండా అత్యధిక ఓటింగ్ నమోదు చేయించిన పోలింగ్ బూత్ కమిటీలను నగదు ప్రోత్సహంతో ఘనంగా సన్మానించి సరికొత్త సాంప్రదాయానికి తెరదీశారు.

భవిష్యత్తులోనూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ మీ పోలింగ్ బూత్ పరిధిలో అత్యధిక ఓట్లు పోలయ్యేలా చేసి కరీంనగర్ పార్లమెంట్ ను దేశంలోనే అగ్రభాగాన నిలపాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. అంతకుముందు బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మోదీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బండి సంజయ్ ప్రారంభించారు. పలువురు బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరానికి హాజరై రక్తదానం చేశారు.








# దర్శి జాబ్ మేళాకు అనూహ్య స్పందన

- స్పందన అద్భుతం
- దర్శిని అభివృద్ధి పథంలో నడిపించడమే నా లక్ష్యం
- వైసిపి నాయకులు విద్వేషాలను, రెచ్చగొట్టే వ్యాఖ్యలను వీడాలి
- ఎవరెన్ని కుయుక్తులు పన్నినా దర్శిని అభివృద్ధి చేసి చూపిస్తా
- దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మహానాడు: ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన జాబ్ మేళాలకు అనూహ్య స్పందన లభించింది. మొత్తం 41 కంపెనీలు ఉద్యోగాలు కల్పించనున్నాయి. ఈ కార్యక్రమాన్ని లక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే, ఇప్పటివరకు 1648 మంది ఎన్రోల్ అయ్యారు... మేళా కు అనూహ్య స్పందన రావడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.. వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి, యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన లోకేష్ బాబు ఇతర మంత్రివర్గం సారథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రజా పాలన సాగుతుంది.

అదే స్ఫూర్తితో ఇచ్చిన మాట ప్రకారం దర్శి ప్రాంతంలో వలసలు లేకుండా అందరికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాను ప్రారంభించాం. జాబ్ మేళా ద్వారా యువతకు ఉపాధి కల్పించే ఒక ప్రయత్నాన్ని చేస్తున్నాం, వందరోజుల




కూటమి ప్రభుత్వం ద్వారా మన పాలకులు సేవకులు వలె ఎలా ప్రజల కోసం పని చేయాలనేది నేర్చుకున్నాం. దర్శి ప్రాంతంలో ముఖ్యంగా దొనకొండ, కురిచేడు ప్రాంతాలలో యువత పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. చదువుతో సంబంధం లేకుండా వృత్తి నైపుణ్యత ఆధారంగా ఉపాధి కల్పించే లక్ష్యంతో మనం ఈ జాబు మేళాను ఏర్పాటు చేశాం. ఎంతో కొంత ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందని భావిస్తున్నాను, ఆ ప్రయత్నాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రజలందరూ నుండి కూడా స్పందన కనిపిస్తుంది. అయితే ఈ మంచి కార్యక్రమాన్ని అడ్డుకొని ప్రజలకు జరిగే మేలును అడ్డుకునేందుకు స్థానిక శాసన సభ్యుడు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, వైసీపీ శక్తులు వివాదాలు గొడవలు ఘర్షణలతో శాంతి భద్రతలకు విఘాతం కల్పించే అనేక చర్యలకు కోరుకుంటున్నారు. అయినా ఈ మంచి కార్యక్రమానికి వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని మరొకసారి చెప్తున్నాను,

వరదలను ఎదుర్కొని ముఖ్యమంత్రి ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఇవన్నీ చూసి తట్టుకోలేని వైసిపి నాయకుల అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి జైల్ల చుట్టూ తిరుగుతున్నాడు. నేరస్తులను పట్టుకోకూడదట, టిడిపి కార్యాలయం పై దాడులు, మాచర్ల వంటి నియోజకవర్గాల్లో అరాచకాలు చేసిన నేతలు జైల్లో ఉంటే, వరదల్లో ఉన్న ప్రజానీకం బాగోగులు పక్కనపెట్టి పట్టించుకోకుండాజైళ్ళ వద్దకు వచ్చి ప్రజలను రెచ్చగొడుతున్నారు. జాబ్ మేళా కి 2300 మంది నిరుద్యోగులు వచ్చారు. ఎంపికయిన వారు 585 మంది. ఇది తొలి ప్రయత్నం మాత్రమే ఇది తొలి అడుగు మాత్రమే... ఇది నిరంతర ప్రక్రియ.. ఈ జాబ్ మేళా లో అర్హత పొందిన వారు మాత్రమే అర్హులు కాదు నిరంతరం ఈ జాబ్ మేళా కొనసాగుతుంది. దర్శి ప్రాంతం లో వలసలు నివారించే లక్ష్యంగా ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పించటమే నా లక్ష్యం. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు , తాళ్లురు మండల ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, కురిచేడు మండల టిడిపి అధ్యక్షుడు పిడతల నేమిలయ్య, దొనకొండ మండల టిడిపి అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వర రావు, , ముండ్లమూరు మండల టిడిపి అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాస రావు, , తాళ్లూరు మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్

- కేబినెట్ నిర్ణయం
- మరో యువగళం హామీని నెరవేర్చిన మంత్రి లోకేష్

అమరావతి, మహానాడు: యువగళం పాదయాత్రలో యువనేత లోకేష్ ఇచ్చిన హామీలు ఒక్కొకటిగా కార్యరూపం దాల్చుతున్నాయి. తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మాజీ సైనికులు యువగళం పాదయాత్ర సందర్భంగా యువనేత లోకేష్ కు వినతిపత్రం సమర్పించారు. అధికారంలోకి వచ్చాక దేశం కోసం సేవలందించిన మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని లోకేష్ అప్పట్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆ హామీ నెరవేరుస్తూ బుధవారం నాటి క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం యువగళం హామీలన్నిటినీ ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు మంత్రి లోకేష్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు నెరవేర్చాల్సిన హామీలపై ఇప్పటికే ఆయా శాఖల మంత్రులతో చర్చిస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం కారణంగా కొంచెం సమయం పట్టినా యువగళంలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి తీరుతామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదని లోకేష్ స్పష్టం చేశారు.




# చంద్రన్న 100 రోజుల పాలనకు వందనం

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, మహానాడు:

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ దర్శి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలాల మధ్య బుధవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా 100 రోజు పాలనలో ప్రజల కోసం, ఇచ్చిన మాట కోసం 100 అద్భుతమైన సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేసిన మహా నాయకుడు చంద్రబాబు నాయుడని ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకులు ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబు సారథ్యంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందన్నారు.

వంద రోజులలో కూటమి ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల కళ్ళల్లో వెలుగులు నింపిందని గొట్టిపాటి లక్ష్మీ వివరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మాజీ శాసన సభ్యుడు నారపుశెట్టి పాపారావు, చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తాళ్లూరు మండల అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, దొనకొండ మండల అధ్యక్షుడు శివ కోటేశ్వర రావు, కురిచేడు మండల అధ్యక్షుడు నెమలయ్య, పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, వివిధ మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




# ఇది పనిచేసే ప్రభుత్వం

- బీజేపీలోకి వైసీపీ నాయకుల చేరిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే సుజనాచౌదరి

విజయవాడ, మహానాడు: పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ కు చెందిన వైసీపీ నాయకులు మంగళవారం పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) సమక్షంలో బిజెపిలో చేరారు. వైసీపీ నాయకుడు యలకల అనిల్ ఆధ్వర్యంలో 50 మంది వైసీపీ నాయకులు కార్యకర్తలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి సుజనా చౌదరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యే సుజనా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ లో ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన అంతమైందన్నారు. ఇది పనిచేసే ప్రభుత్వం. ఎన్డీయే కూటమి గెలుపుతో రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొస్తామని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలన ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ సహకారంతో భారతీయ జనతా పార్టీలో చేరినట్లు నాయకులు కుంభ రమేష్ తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ నిర్వహించి స్థానిక మహిళలకు చీరలు ,దుప్పట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో యలకల అనిల్, నాగరాజు, రెడ్డిపల్లి రాజు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
4
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||







## 32వ రోజు మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్"కు విజ్ఞప్తులు














జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||















## మేము సైతం..

ఉండవల్లి, మహానాడు:

వరదలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మేము సైతం అంటూ.. ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసి పలువురు విరాళాలు అందజేశారు. గుంటూరుకు చెందిన దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ. 6,01,116 అందజేశారు. అమలాపురానికి చెందిన బోనం వెంకట చలమయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ బోనం కనకయ్య రూ.5 లక్షలు, నంద్యాలకు చెందిన ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఎండీ ఎస్.దినేష్ రెడ్డి, కాలేజీ డీన్ బి.సూర్యప్రకాశ్ రెడ్డి రూ.4 లక్షలు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నేతృత్వంలో ప్రజలు, వివిధ సంస్థల నుంచి సేకరించిన విరాళం రూ.2,95,000 లక్షలు, నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రతినిధి జయకుమార్ రూ.2,50,000 లక్షలు, మదనపల్లెకు చెందిన గోల్డెన్ వాలీ ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ ఎన్.వి రమణారెడ్డి, కట్టా దొరస్వామి నాయుడు రూ.2 లక్షలు, అనంతపురానికి చెందిన వి.సురేష్ నాయుడు రూ.లక్ష, బీజేపీ మజ్దూర్ విభాగం నాయకులు నాగేశ్వరరావు రూ.10 వేలు అందించారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన వారికి మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.








## 'పశ్చిమ'లో వైసీపీకి భారీ షాక్!

- టీడీపీలోకి ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ
- ఆమె సహా పార్టీలో చేరిన పలువురు వైసీపీ నేతలు
- కండువా కప్పి పశ్చిమగోదావరి నేతలను ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్

అమరావతి, మహానాడు:

అభివృద్ధిని కాంక్షించి పలువురు వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీ(టీడీపీ)లో చేరుతున్నారు. తాజాగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నేతృత్వంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ వైసీపీకి రాజీనామా చేసి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆమెతో పాటు వైసీపీ జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ గంటా ప్రసాదరావు, పామర్తి అచ్యుత్ గౌడ్, ఈ.అశోక్, ఎస్.కిషోర్, ఎస్.మురళీ, రెడ్డి కిషోర్ టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో వీరందరికీ పసుపు కండువాలు కప్పి మంత్రి నారా లోకేష్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.













## గాంధీ నడయాడిన పల్లెకు మంచినీరు సౌకర్యం కల్పించండి

- వరదలతో పంట నష్టపోయాం, పరిహారం అందించి ఆదుకోండి
- 32వ రోజు మంత్రి నారా లోకేష్ "ప్రజాదర్బార్"కు విజ్ఞప్తులు
- ప్రజాప్రభుత్వం ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తుందని మంత్రి భరోసా

అమరావతి, మహానాడు:

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు విని పరిష్కరించేందుకే ప్రజాప్రభుత్వం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా పరదాలు కట్టుకుని తిరగడం లేదని, కష్టాల్లో ఉన్న ప్రతిఒక్కరికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ 32వ రోజు "ప్రజాదర్బార్" కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రి లోకేష్ ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### మంగళగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన విజ్ఞప్తులు

#### వరదలతో పంట నష్టపోయాం

- కుంచనపల్లి, ప్రాతూరు ప్రాంత రైతులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. భారీ వర్షాలకు కుంచనపల్లి, ప్రాతూరు లంక పొలాలు నీటమునిగి తీవ్రంగా నష్టపోయామని, పొలాల్లోని ఆయిల్ ఇంజన్లు సైతం నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- వరదలకు మంగళగిరి పట్టణం 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి నగర్ లో తమ ఇళ్ళల్లోకి నీరు చేరి, ఇంట్లోని వస్తువులు పాడైపోయాయని బాధితులు మంత్రి నారా లోకేష్ కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాల నష్టపోయిన తమకు ప్రస్తుతం కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని, తగిన ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారం నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని, డిగ్రీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని తాడేపల్లికి చెందిన ఆర్.సాయి కుమారి విజ్ఞప్తి చేశారు.
- కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదివిన తనకు ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని కాజకు చెందిన మాణిక్యాల సాయి కోరారు.
- తాడేపల్లి మండలం సీతానగరంలో గత 30 ఏళ్లుగా తన పేరుపై రిజిస్టరై ఉన్న ఇంటిస్థలాన్ని మేడా వెంకటేశ్వరరావు, అతని సోదరులు ఆక్రమించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, విచారించి తగిన న్యాయం చేయాలని విజయవాడకు చెందిన హేమాద్రి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి మంత్రి హామీ ఇచ్చారు.

#### రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు

- గాంధీ మహాత్ముడు నడయాడిన గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం ఏ.ముప్పాళ్ల వాసి రాపర్ల జగన్నాథం మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. 10వేల జనాభా ఉన్న గ్రామంలో నీటికి ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ గ్రామంలో గాంధీ మూడు రోజులు బసచేశారని, ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా తమ గ్రామానికి వచ్చినప్పుడు తులాభారం వేసినట్టు వివరించారు. అంతటి చారిత్రక నేపథ్యం ఉన్న తమ గ్రామానికి నాగార్జున సాగర్ కెనాల్ నుంచి పైప్ లైన్ ద్వారా నీటి వసతి కల్పించాలని కోరారు.
- రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలని గవర్నమెంట్ కాంట్రాక్ట్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిలి విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ ద్వారా రోస్టర్ పాయింట్ ఆధారంగా మెరిట్ లో ఎంపికై గత పదేళ్లుగా అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ, కోవిడ్-19 సేవలందించామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు 15 ఏళ్ళుగా శాశ్వత ప్రాతిపదికన ఒక్క ఉద్యోగానికి కూడా నోచుకోలేదన్నారు. రెగ్యులర్ పోస్టు కోసం ఎదురుచూస్తున్న తమకు న్యాయం చేయాలని, అర్హత కలిగిన స్టాఫ్ నర్సులకు



రెగ్యులర్ పోస్టులు ఇవ్వాలని కోరారు.

- టీడీపీ హయాంలో హోంగార్డు ఉద్యోగాలు పొంది వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న తమను అనంతరం వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో అప్పటి అధికారులు ఉద్యోగాల నుంచి తొలగించారని చిత్తూరుకు చెందిన 87 మంది హోంగార్డులు మంత్రి నారా లోకేష్ కలిసి ఫిర్యాదు చేశారు. తిరిగి హోంగార్డు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా, వీఆర్ పురం మండలం కె.కొత్తగూడెం గ్రామ రైతులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. పోలవరం ప్రాజెక్టు కింద సేకరించిన తమ భూములకు వచ్చిన నష్టపరిహారాన్ని ఫోర్జరీ సంతకాలతో అధికారులు స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. రీ సర్వే చేయడంతో పాటు నష్టపరిహారాన్ని రికవరీ చేసి వాస్తవ బాధిత రైతులకు భూపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- గోదావరి డెల్టా సిస్టమ్ ధవళేశ్వరం సర్కిల్ పరిధిలో అవుట్ సోర్సింగ్ డైలీ వేజ్ లస్కర్లు పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 10 నెలల వర్క్ ఆర్డర్ ను 12 నెలలకు పెంచాలని సిబ్బంది మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 15 నెలల పెండింగ్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.











జనం గుండె చప్పుడు
# మహానాడు
6
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||

అల్ట్రాటెక్ సిమెంట్స్ నుంచి రూ.2 కోట్లు చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేస్తున్న ఆ సంస్థ ప్రతినిధి డాక్టర్ వసంతరావు పాలపల్లి





















# పిలుపిచ్చిన ప్రభుత్వం...కదిలొస్తున్న దాతలు


**అమరావతి,మహానాడు:**
వరద బాధితులకు విరాళాలు ఇవ్వడానికి పలువురు దాతలు ముందుకొస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో స్పందించితన దాతలు, ప్రముఖులు, పారిశ్రామిక, వ్యాపార, విద్యా, వాణిజ్య సంస్థలకు చెందిన వారు బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుని కలిసి విరాళాలు అందించారు. వరద బాధితులకు సాయం అందించడానికి ముందుకొచ్చిన దాతలను సీఎం అభినందించారు.

**విరాళాలు అందించిన వారిలో...**

1. డాక్టర్ వసంతరావు పాలపల్లి, అల్ట్రాటెక్ సిమెంట్స్ రూ.2 కోట్లు
2. విశాఖ ఎంపీ శ్రీభరత్ (గీతం యూనివర్సిటీ) రూ.1 కోటి
3. గోరంట్ల బుచ్చయ్య చౌదరి (వ్యక్తిగత విరాళం రూ.5 లక్షలతో కలిపి) రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ప్రజల తరఫున రూ.83లక్షల 44 వేల 624లు
4. రామ్మోహన్ రావు, భాగ్యనగర్ గ్యాస్ ఎండీ రూ.50 లక్షలు
5. మోహిత్ బండి, బన్నీ బండి , స్టీల్ ఎక్స్ఛేంజి ఇండియా లిమిటెడ్ రూ.50 లక్షలు
6. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, డాక్టర్ ఎం.పెద్దరత్తయ్యలు నియోజకవర్గప్రజలు రూ.35 లక్షలు
7. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోయేషన్ డాక్టర్ విజయ్‌కుమార్ రూ.20 లక్షలు
8. ఎస్.వెంకటేశ్వరరెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ హైర్ బసెస్ ఓనర్స్ అసోసియేషన్ రూ.24 లక్షలు
9. గుంటూరుకు చెందిన ఛార్టెర్డ్ అకౌంటెంట్ గడ్డిపాటి సుధాకర్ రూ.20 లక్షలు
10. మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ రూ.14లక్షల 50 వేలు
11. వై.రవిబాబు, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్, రాజమండ్రి రూ.10 లక్షలు
12. 108 ఎంప్లాయీస్ అసోసియేషన్ రూ.10 లక్షలు
13. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ రూ.10 లక్షలు
14. రాయదుర్గం గార్మెంట్స్ అసోసియేషన్ & స్పాంజ్ ఐరన్ ప్లాంట్స్ రూ.8 లక్షల 20 వేలు
15. నెయ్యలకుల మత్స్యకారుల సంక్షేమ సంఘం రూ.6 లక్షల 50 వేలు
16. కిన్నెర మాల్యాద్రి, కిన్నెర ఫౌండేషన్ రూ.5 లక్షలు
17. కె.వెంకటరమణారెడ్డి ఎస్ ఏ ఎస్ ఆర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ..5 లక్షలు
18, శ్రీనివాస్ గార్మెంట్స్ రూ.3 లక్షలు
19. ఓం శ్రీ షిర్డీ సాయిబాబా సేవా సమితి రూ. 3 లక్షలు20. వక్కా వరప్రసాద్ రూ.1లక్ష 50 వేలు
21. సాయి బాలజీ స్పాంజి ఐరన్ ఇండియా లిమిటెడ్ రూ.1లక్ష11వేల,111
22. ఆచార్య ఎన్.జీ రంగా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ వీ.దామోదర్ నాయుడు రూ.1 లక్ష
23. మైథిలి ఫౌండేషన్ రూ.1 లక్ష
24. వి.శకుంతలమ్మ రూ.1 లక్ష
25. గుడ్లూరు శ్రీధర్ రూ.1 లక్ష
26. జేఆర్ మెటల్ చెన్నై రూ.1 లక్ష
27. ఎస్ ఎల్వీ స్టీల్స్ అండ్ అల్లాయిస్ రూ.1 లక్ష
28. రావూస్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.1 లక్ష
29. కొండారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.1 లక్ష
30. స్వర్ణలత రూ.50 వేలు

## వరద బాధితుల సహాయార్థం
## సీఎం చంద్రబాబుకు పలువురు చెక్కుల అందజేత





జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||




## దేశ అభివృద్ధి కొరకే జమిలి ఎన్నికలు

- జమిలితో సమయం డబ్బు రెండు అదా
- ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక దేశంగా భారత్
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి




హైదరాబాద్,మహానాడు: దేశంలో అన్ని సామాజికవర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడమే లక్ష్యంగా మోడీ వంద రోజుల పాలన పూర్తి చేసుకున్నది. కార్మిక, కర్షక, శ్రామికుల అభివృద్ధికి మోడీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ వెళ్తోంది. మహిళా సాధికారత కోసం మోడీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది.

75 ఏళ్ల పైబడిన ఆరు కోట్ల మందికి హెల్త్ కార్డులు ప్రొవైడ్ చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ఈకో సిస్టాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మ్యాన్ ఫ్యాక్చర్ హబ్‌గా ఇండియా వేగంగా దేశం అభివృద్ధి చెందుతోంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక దేశంగా భారత్ నిలబడబోతోంది.

దేశ అభివృద్ధి కొరకే జమిలి ఎన్నికలు. జమిలి తో సమయం డబ్బు రెండు అదా అవుతాయి. దేశంలో నిత్యం ఏదో ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో దేశ అభివృద్ధికి కొంత ఆటంకం ఏర్పడుతుంది. దేశ అభ్యున్నతి కోసం తీసుకున్న నిర్ణయాలు కొంత మందికి నచ్చవు. జమిలి ఎన్నికలకు కొంత సమయం పడుతుంది. అందుకే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలకు ఎన్నికలు. పార్లమెంట్‌లో జమిలి బిల్లు ప్రవేశ పెడతారు. అప్పుడు అందరికీ మాట్లాడే అవకాశం వస్తది. ప్రతిపక్షాలకు ఏదైనా అభ్యంతరం ఉంటే చర్చలో చెప్పొచ్చు.ఖఇ




## ఉజ్జయినీ జ్యోతిర్లింగ ఆలయాన్ని సందర్శించిన మంత్రి ఉత్తమ్ దంపతులు

హైదరాబాద్,మహానాడు: నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయన సతీమణి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ రెడ్డి దంపతులు బుధవారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అత్యంత ప్రాశస్త్యం చెందిన ఉజ్జయినిలోని మహా కాళేశ్వర జ్యోతిర్లింగ ఆలయాన్ని సందర్శించారు.తెలంగాణా రాష్ట్రం రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ మంత్రి ఉత్తమ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తిరుపతి లడ్డూ, ప్రసాదాలలో జంతువుల నూనెపై పూర్తి విచారణ చేయండి

- దోషులను కఠినంగా శిక్షించండి



తిరుపతి,మహానాడు: దేవ దేవుడు తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులకు ఇచ్చే లడ్డూ, ప్రసాదాలలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు పదార్థాలను వాడారన్న ఆరోపణలపై పూర్తి విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య డిమాండ్ చేశారు.

సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు లడ్డూల నాణ్యతను దెబ్బ తీసి, ప్రసాదాలను కూడా వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందంటూ లడ్డూ తయారీలో జంతువుల కొవ్వును వాడారన్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోడీ దృష్టి పెట్టాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తిరుపతి వెంకన్నను దర్శించుకుంటారని, ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన వారు శిక్షకు పూర్తిగా అర్హులని చెప్పారు.

హిందూ మనోభావాలతో పాటు సర్వమతాల మనోభావాలను దెబ్బ తీసిన ఇలాంటి చర్యలపై త్వరితగతిన విచారణ అవసరం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తిరుపతి పవిత్రతకు భంగం కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, కొత్త టిటిడి బోర్డు నియామకంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని బాలకోటయ్య విజ్ఞప్తి చేశారు.

## డైవర్షన్ కోసమే జమిలి ఎన్నికలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి

హైదరాబాద్,మహానాడు: దేశంలో జమిలి ఎన్నికలు సాధ్యం కావు.రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన 18 వేల పేజీల నివేదికలో ఏముందో బయట పెట్టండి. అఖిలపక్ష సమావేశం పెట్టకుండా, ఎవరితోనూ చర్చించకుండా కేవలం క్యాబినెట్‌లో పెట్టి ఆమోదించింది వారిపై ఉన్న వ్యతిరేకతను మళ్లించడం కోసమే. వన్ నేషన్, వన్ ఎలెక్షన్, వన్ లీడర్ అంటూ ఒక ప్రమాదకర సిద్ధాంతాన్ని బీజేపీ తెర మీదకు తెస్తోంది.

## అధికారం పోయాకైనా ఆడ వాళ్లను అవమానించడం మానుకో జగన్

- పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు దాసరి ఉదయ శ్రీ

పల్నాడు,మహానాడు: మహిళా సంక్షేమం, మహిళా భద్రత అంటూ గడిచిన ఐదేళ్లు ప్రచారార్భాటాలు చేసిన జగన్మోహన్ రెడ్డి సొంత పత్రికలో మహిళను తీవ్రంగా అవమానిస్తూ తన నైజాన్ని బయటపెట్టుకుంటున్నాడు.

జగన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతి రెడ్డి సాక్షి పత్రికకు చైర్ పర్సన్ గా ఉండి



సాటి మహిళలను అవమానించడం సిగ్గుచేటు.

జత్వానీ కేసులో తాడేపల్లి ప్యాలెస్‌లోనే స్క్రిప్ట్ రాసింది వాస్తవం కాదా?

అంత పెద్ద సార్ చెప్పారని ఎఫ్ ఐఆర్ నమోదైన గంటలోనే జత్వానీని అరెస్ట్ చేయడానికి ముంబై ఫ్లైట్ ఎక్కానని సస్పెండైన విశాన్ గున్నీ లిఖితపూర్వకంగా ఇచ్చిన వివరణపై ఏం చెబుతావ్ జగన్ రెడ్డీ?

జత్వానీని అరెస్ట్ చేయడానికి వెళ్లేందుకు కనీసం డీజీపీ అనుమతి కూడా తీసుకోకుండా ముంబై వెళ్లడం దేనికి సంకేతం?జత్వానీ ఆమె తప్పు చేసినట్టు ఆధారాలు లేవు. అయినప్పటికీ కేసు పెట్టడానికి ముందే ముంబై టికెటక్కు బుక్ చేసుకున్నది వాస్తవం కాదా?

పారిశ్రామిక వేత్తను కాపాడేందుకు ఆమెపై ఏపీలో కేసు పెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడింది జగన్ రెడ్డీ కదా? గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు నిత్యం మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతూనే ఉండేవి అధికారం పోయాకైనా సరే ఆడ వాళ్లను అవమానించడం మానుకో జగన్ రెడ్డి.

### పీహెచ్సీ డాక్టర్ల ప్రయోజనాల పరిరక్షణకు

# జీఓ 85 సవరణకు అంగీకారం

- ఇన్ సర్వీస్ రిజర్వేషన్ కు సంబంధించి పీహెచ్సీ డాక్టర్ల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వ సానుకూల స్పందన
- పలు ఇతర డిమాండ్లను కూడా పరిశీలించేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ
- ఏ సమస్య పరిష్కారానికైనా మొండిపట్టు విడనాడాలన్న మంత్రి
- ఇన్ సర్వీస్ రిజర్వేషన్ తగ్గింపుపై గత ప్రభుత్వ హయాంలోనే నివేదిక వచ్చిందన్న మంత్రి
- ప్రభుత్వ హామీల నేపథ్యంలో పీహెచ్సీ డాక్టర్లు ఆందోళనను విరమించాలని సూచన
- ప్రభుత్వం, పీహెచ్సీ డాక్టర్ల సంఘం ప్రతినిధుల మధ్య సుహృద్భావ చర్చలు



అమరావతి,మహానాడు: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వ పీహెచ్సీ డాక్టర్ల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు సానుకూలంగా స్పందించింది.

ప్రభుత్వం, పీహెచ్సీ డాక్టర్ల సంఘం ప్రతినిధుల మధ్య బుధవారం సచివాలయంలో దాదాపు 2 గంటల పాటు సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయి. వైద్య, ఆరోగ్య శాఖ , కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు,ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కమీషనర్ సి.హరికిరణ్, డిఎంఇ డాక్టర్ నరసింహం, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, పీహెచ్సీ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ యూనిస్ తో పాటు 15 మంది డాక్టర్లు చర్చల్లో పాల్గొన్నారు.

పలువురు పీహెచ్సీ డాక్టర్ల సంఘం నాయకులు ఇన్ సర్వీస్ రిజర్వేషన్ విషయంతో పాటు వారి సేవలకు సంబంధించిన పలు ఇతర డిమాండ్లను సమావేశంలో వివరించారు. ఇన్ సర్వీస్ రిజర్వేషన్ కు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85 ఉపసంహరణ, సమయ బద్ధ పదోన్నతులు, నామ మాత్రపు ఇంక్రిమెంట్లు, ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఇతర ఎంబిబియస్ డాక్టర్లకు అందిస్తున్న ఆర్థిక వెసులుబాటును పీహెచ్సీ డాక్టర్లకు వర్తింపజేయడం వంటి విషయాల్ని వారు ప్రస్తావించారు.

పీహెచ్సీ డాక్టర్ల డిమాండ్లకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. పీహెచ్సీ డాక్టర్లు పీజీ వైద్య విద్య పూర్తి చేసుకుని 2027లో సర్వీసులో చేరే సమయానికి వివిధ స్పెషలిస్టు డాక్టర్ల ఖాళీల లభ్యతను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ఆశిస్తున్న డాక్టర్ల సంఖ్యను పరిగణలోకి తీసుకుని వారికి వీలైనంత మేరకు న్యాయం చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని మంత్రి అన్నారు.

ఇందుకోసం జీఓ 85లో సవరణలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. 2020 నాటికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల ఖాళీల లభ్యత, ఈ ఏడాది పీజీ పరీక్షలో అర్హత పొందిన పీహెచ్సీ డాక్టర్ల సంఖ్య మధ్య భారీ వ్యత్యాసముందని, అయినా వారి ఆశల్ని నేరవేర్చడానికి ప్రయత్నం చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

ఈ దిశగా మరోసారి పీహెచ్సీ డాక్టర్ల సంఘం ప్రతినిధులతో చర్చించి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం సీట్ మ్యాట్రిక్స్ ప్రకటించేలోగా తుది నిర్ణయాన్ని తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

2021లో పీజీ వైద్య విద్యలో క్లినికల్ సీట్లలో రిజర్వేషన్ ను 30 శాతానికి, నాన్ క్లినికల్ సీట్లలో 50 శాతానికి పెంచిన గత రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే దాని పర్యవసానాలను క్షుణ్ణంగా పరిశీలించి, రిజర్వేషన్ శాతంపై తగు సిఫారసులు చేయడానికి త్రిసభ్య కమిటీని నియమించిందని, ఆ కమిటీ రిజర్వేషన్ శాతాన్ని సగానికి కుదించిందని మంత్రి వివరించారు.

ఈ నివేదికలోని అంశాలు ఈ ఏడాది నీట్ పీజీ పరీక్ష జరగడానికి చాలా ముందే బహిరంగమయ్యాయని, అందులోని అంశాలు పీహెచ్సీ డాక్టర్లకు తెలుసునని మంత్రి వ్యాఖ్యానించారు. జీఓ 85ను పీజీ పరీక్షకు కొద్ది సమయం ముందే విడుదల చేయడం జరిగిందన్న పీహెచ్సీ డాక్టర్ల వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు

ఏ సమస్య అయినా, ప్రతిష్టంభన అయినా పరిష్కారం కావాలంటే ఇరు పక్షాలూ పట్టు విడుపు ధోరణిలో వ్యవహరించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల పోస్టుల లభ్యత, నియామకాలపై ప్రభుత్వంపై ఉన్న పరిమితుల్ని ఆందోళన చేస్తున్న వైద్యులు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు.

ఎన్నో ప్రయాసలకోర్చి ప్రజలకు పీహెచ్సీ వైద్యులు సేవలందిస్తున్నందున పీజీ వైద్య విద్య పట్ల వారి ఆశల్ని నెరవేర్చాలన్న ఆలోచనతోనే ప్రభుత్వం జీఓ 85ను సవరించడానికి అంగీకరించిందని ఆయన వివరించారు. ఈ జీఓలో ప్రస్తావించిన 6 పీజీ కోర్సుల్లోనే కాకుండా అన్ని కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలన్న వైద్యుల డిమాండ్ ను కూడా సానుకూలంగా పరిశీలించడానికి మంత్రి అంగీకరించారు.

పలు డిమాండ్లపై ప్రభుత్వ సానుకూల స్పందన నేపథ్యంలో పీహెచ్సీ డాక్టర్లు తమ ఆందోళన కార్యక్రమాన్ని విరమించుకుని విధుల్లో చేరాలని మంత్రి కోరారు. త్వరలో మరోసారి పీహెచ్సీ డాక్టర్ల సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపి తుది నిర్ణయాన్ని తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

కనీసం పీహెచ్సీ వైద్యులతో సంప్రదించకుండా ఇన్ సర్వీస్ రిజర్వేషన్‌ను తగ్గించడం వైద్యుల్ని ఆగ్రహానికి గురిచేసిందన్న వ్యాఖ్యకు స్పందిస్తూ, ప్రజాభిప్రాయానికి ఏమాత్రం విలువనివ్వని గత ప్రభుత్వం ఆ విధంగా నడుచుకుందని, అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించే కూటమి ప్రభుత్వం పలు దఫాలుగా పీహెచ్సీ వైద్యుల సంఘం నాయకులతో చర్చిస్తూ వారికి తగు మేరకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తోందని మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

భారీ స్థాయిలో పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ రిజర్వేషన్ కల్పించడం వల్ల ఎంబిబియస్ తర్వాత ఉన్నత వైద్య విద్యను అభ్యసించాలనుకుంటున్న తాజా యువ ఎంబిబియస్ డాక్టర్లు, వారి తల్లిదండ్రుల నుండి కూడా ఆందోళన వ్యక్తమవుతోందని ఈ మేరకు పలువురు తమ ఆందోళనను తమతో పంచుకున్నారని మంత్రి ఈ సమావేశంలో తెలిపారు.

## బాబుని భగవంతుడు క్షమించడు

- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి



తిరుపతి,మహానాడు: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం తిరుమల ప్రసాదాలపై చంద్రబాబు చేసిన ఆరోపణలు అత్యంత దుర్మార్గం. రాజకీయ లబ్ధికోసం, రాజకీయ స్వార్థకోసం భగవంతుడ్ని వాడుకుంటే.. అలాంటి ఆరోపణలు చేసినవాడ్ని భగవంతుడు క్షమించడు. ఇందులో ఎలాంటి సందేహం లేదు.

శ్రీ వేంకటేశ్వరస్వామి దుష్టశిక్షణ చేస్తాడని స్వయంగా చంద్రబాబే పలుమార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను. కనుక ఇలాంటి నీచమైన ఆరోపణలు చేసిన వ్యక్తిని భగ వంతుడు చూస్తూ ఊరుకోడు. రాజకీయ ప్రత్యర్థులను దృష్టిలో ఉంచుకుని భగవంతుడి పేరుమీద ఆరోపణలు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదు.

గతంలో వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి ఆరోపణలు చేసిన సందర్భాలున్నాయి. దీనికి అప్పుడు భగవంతుడు శిక్ష కూడా విధించాడు. అయినా చంద్రబాబు మారలేదు. ఇప్పుడు మళ్లీ అలాంటి ఆరోపణలే చేస్తున్నారు. వాస్తవం ఏంటంటే, తిరుమలలో అన్నప్రసాదాలు తయారు చేసే విషయంలో అధికారులకు ఎలాంటి ప్రమేయం ఉండదు. పవిత్రమైన శ్రీ వైష్ణవుల అమృత హస్తాలమీదుగా ఈ పదార్థాలు తయారవుతాయి.

ప్రసాదాల్లో పదార్థాల వినియోగం వారి చేతులమీదుగా ఉంటుంది. అలాంటి వారి హస్తాల మీదుగా తయారయ్యే ప్రసాదాలమీద చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నాడంటే.. ఆయన బురదరాజకీయాలకు పరాకాష్ట. ఈ దఫా అధికారం లోకి వచ్చింది మొదలు తిరుమల వేదికగా చంద్రబాబు చేసిన విషప్రచారాలు అన్నీ ఇన్నీకావు. చివరకు ఏమీ దొరక్కపోవడంతో ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు.

## బీసీల పక్షపాతి చంద్రబాబు

- బీసీ శాఖ మంత్రి సవిత



అమరావతి,మహానాడు: బీసీలకు టీడీపీతోనే మేలు కలుగుతోందన్న విషయం మరోసారి రుజువైందని, వెనుకబడిన తరగుతల పక్షపాతి చంద్రబాబు అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ డిక్లరేషన్ పేరుతో ఎన్నికల ముంగిట వెనుకబడిన తరగతుల వారికి ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తూ వస్తున్నారన్నారు.

దీనిలో భాగంగా బీసీలకు మరింత రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో చట్టసభల్లో 33 శాతం మేర రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బుధవారం నాటి కేబినెట్ భేటీలో తీర్మానం ఆమోదించిందన్నారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన కులాలు వారు ధన్యవాదాలు తెలుపుతున్నారన్నారు.

బీసీలకు టీడీపీ ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటూ వస్తోందన్నారు. మహానుభావుడు, అన్నగారు ఎన్టీ రామారావు... బడుగు, బలహీన వర్గాల వారికి మేలు కలుగజేయాలన్న లక్ష్యంతో టీడీపీని స్థాపించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాటులో బీసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు, మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి బీసీ హాస్టళ్లు నెలకొల్పి...వెనుకబడిన తరగతుల పిల్లలకు విద్యను దగ్గర చేశారన్నారు.

ఎన్టీ రామారావు స్ఫూర్తితో పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడు కూడా బీసీలకు దన్నుగా ఉంటూ వస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన తరగతుల యువతకు ఆర్థిక భరోసా కలిగేలా స్వయం ఉపాధి రుణాలు ఇస్తున్నారన్నారు. బీసీ విద్యార్థుల విద్యా ప్రగతికి బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లను విరివిగా మంజూరు చేయడంతో పాటు భవన నిర్మాణాలు చేపట్టారని మంత్రి తెలిపారు.

ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం కింద బీసీ విద్యార్థులకు విదేశాల్లో చదివేలా అవకాశం కల్పించారన్నారు. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహమందజేశారన్నారు.

స్టడీసర్కిళ్ల ద్వారా సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణిస్తూ బీసీ విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. ఆదరణ పథకం కింద వెనుబడిన తరగతుల్లో ఉన్న చేతివృత్తుదారులకు పనిముట్లు అందజేశా రన్నారు.

### రాజ్యాధికారంలో బీసీలకు భాగస్వామ్యం

బీసీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేశాయని మంత్రి తెలిపారు. పాలనలోనూ భాగస్వామ్యమయ్యేలా బీసీలకు ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రులుగా అత్యధిక మందికి అవకాశమిచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న చంద్రబాబుకు బీసీ సంఘాలు, కులాలు ధన్యవాదాలు తెలుపుతున్నాయని ఆ ప్రకటనలో మంత్రి సవిత వెల్లడించారు.




### 100 రోజుల పాలనలో

## ఎంతో ప్రగతి

- బిజెపి ఎమ్మెల్యేలు

విజయవాడ,మహానాడు: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న వారధి కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత పెన్మత్స విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఏమన్నారంటే..ప్రజా సమస్యల పరిస్కారం కొరకు బీజేపీ వారధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము.వివిధ రకాల సమస్యలు మా దృష్టికి తీసుకువస్తున్నారు.గత ఐదు సంవత్సరాలలో వైసీపీ చేసిన




దురాగతాలకి ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులకి గురయ్యారు. 100 రోజుల కూటమి ప్రభుత్వం పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయటంతో పాటు రాష్ట్ర అభివృద్ధి కొరకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. 15 లక్షల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీ కారం.

### రైతులకి తగిన న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

బుడమేరు వరద ఉధృతిలో నష్టపోయిన బాధితులని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.నష్టపోయిన బాధితులు, అలాగే రైతులకి తగిన న్యాయం చేస్తాం. రాజధాని ప్రాంతం వరదకి గురవుతాయాని విషప్రచారం కొందరు చేస్తున్నారు.రాజధాని ప్రాంతంలో అలాంటి ఇబ్బందులు ఉండవు.

గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా కాలయాపన చేసారంటూ వైసీపీపై విమర్శలు చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాద్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీ నివాస్, వారధి సమన్వయ కర్త కిలారు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com



డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||

## భోగాపురం విమానాశ్రయం పేరు అభినందనీయం

- మాజీ ఎమెల్సీ మంతెన సత్యనారాయణ రాజు



విజయవాడ, మహానాడు: భోగాపురం విమానాశ్రయం పేరును అల్లూరి సీతారామరాజు విమానాశ్రయంగా నామకరణం చేయడం అభినంద నీయం. ఉద్యమ నేత... త్యాగాల ముద్దుబిడ్డ.. అడవితల్లి లాలించి పెంచిన అల్లూరి.. అందరికి ఆదర్శనీయుడు.. దేశం కోసం ఆయన త్యాగం, ఆయన సాహసం అందరికీ స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. ఈ మేరకు ఆయనొక ప్రకటన విడుదల చేశారు. నేటి యువత అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి. విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టడం వలన దేశం కోసం అమరులైన త్యాగమూర్తులకు ఎనలేని కీర్తిని అందించినట్లే. అమర వీరులకు చంద్రబాబు నాయకత్వం కూటమి ప్రభుత్వం ఇచ్చేగౌరవం ఇదే. దేశం కోసం దేశ ప్రజల కోసం బ్రిటీష్ తూటాలకు గుండెలు ఎక్కుపెట్టి ఎదురొడ్డి నిలబడి అల్లూరి చిందించిన రక్తపు ధైర్య సాహసాలే నేడు ఈ స్వేచ్ఛావాయువులు. అటువంటి అల్లూరి పేరును అంతర్జాతీయ విమానాశ్రయానికి పెట్టడం వల్ల ఆయన కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేయడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు.



## ప్రభుత్వ దవాఖాన్లను నాశనం చేసే కుట్రలను మానుకో కేటీఆర్

- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరిక

హైదరాబాద్,మహానాడు:

గాంధీ హాస్పిటల్‌పై బురద జల్లి, ఇక్కడికి ట్రీట్‌మెంట్ కోసం వచ్చే నిరుపేదల మనో స్థైర్యాన్ని దెబ్బతీయడం బాధాకరం.గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కార్పొరేట్ హాస్పిటళ్లు ఏ విధంగా ఎదిగాయో ప్రజలందరికీ తెలుసు. ప్రభుత్వ దవాఖాన్లను ఎలా దెబ్బతీశారో కూడా జనాలు మర్చిపోలేదు.

గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ దవాఖాన్లను పది సంవత్సరాల పాటు నాశనం చేసిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అదే తరహా కుట్రలు చేయడం సిగ్గుచేటు.


గాంధీ వంటి టెర్షియరీ కేర్ హాస్పిటళ్లకు అత్యంత విషమంగా ఉన్న పేషెంట్లు వస్తారు. చివరి నిమిషం వరకూ వాళ్ల రోగాన్ని నయం చేసి, ఎలాగైనా వాళ్లను బ్రతికించేందుకు డాక్టర్లు తమ శక్తిమేర ప్రయత్నిస్తారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడం వల్ల కొంత మంది ప్రాణాలు కోల్పోతారు. అందుకే దేశంలోని ఏ టెర్షియరీ కేర్ హాస్పిటల్‌లోనైనా, ప్రతి నెలా పదుల సంఖ్యలో మరణాలు జరుగుతుంటాయి.

కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే మరణాలు జరిగాయంటూ నంబర్లను భూతద్దంలో పెట్టి చూపించే ప్రయత్నాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్నారు. ఆయన అజ్ఞానికి, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాసే ఆయన సహజ గుణానికి ఆయన మాటలు అద్దం పడుతున్నాయి.

గాంధీని నాశనం చేసి, పేషెంట్లను రానీయకుండా చేసి కార్పొరేట్ హాస్పిటళ్లకు లబ్ధి చేకూర్చాలని ఆయన కుట్ర పన్నుతున్నారు. ఆ కుట్రలో భాగంగానే గాంధీ హాస్పిటల్‌పై బురద జల్లుతున్నారు.

ఇకనైనా ఇలా పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేయడం మానుకోకపోతే, ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారు.గాంధీ దవాఖానకు వచ్చేది దొర జనం కాదు, నా జనం. నేను కూడా పాత గాంధీ హాస్పిటల్‌లోనే పుట్టిన. నా జనాల బాగోగులు చూసుకోవడం నా బాధ్యత అని ఇదివరకే చెప్పాను. మళ్లీ చెబుతున్నాను.

బీఆర్ఎస్ కుట్రలను నమ్మి భయపడకండి. ధైర్యంగా వచ్చి చికిత్స చేయించుకోండి. బీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిన ప్రభుత్వ వైద్య వ్యవస్థను గాడిన పెడుతున్నాం. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.




రాజమండ్రి పార్లమెంట్ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని విజయవాడ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

## విశాఖలో కార్పెంటర్ రాము హత్య!

- పక్కా స్కెచ్‌తో హతమార్చిన స్నేహితులు
- నలుగురు నిందితుల అరెస్టు
- వెల్లడించిన వన్ టౌన్ పోలీసులు

విశాఖపట్నం, మహానాడు:





నగరంలోని వన్ టౌన్ లో కార్పెంటర్ భరణిక రాము(35) దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు సినిమా తరహాలో వేటాడి హతమార్చారు. వినాయకుడి ఊరేగింపులో పక్కా స్కెచ్‌తో అంతమొందించారు. పోలీసులు నిందితులు నలుగురిని బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు అందించిన వివరాలివి. బాపూజీ కొండ, రంగరీజువీధి ప్రాంతానికి చెందిన భరణికా రాము వడ్రంగి పనులు చేస్తూ జీవనం కేవలం సాగిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు. రాజేష్ అనే వ్యక్తి రాముతో కలిసి కార్పెంటర్ పనులు చేస్తుంటాడు. రాజేష్ రాము వారి వ్యాపారంలో తరచూ గొడవలు పడుతూ తరచూ ఒకరినొకరు దూషించుకునేవారు.

ఈ తరుణంలో మామ కుంచయ్య కారణంగా రాము సోదరి చనిపోవడంతో, ఆమె భర్త, కుంచయ్యలతో కూడా రాముకి గొడవలు జరిగాయి. వారం రోజుల క్రితం రాము కొత్త రోడ్డులోని దీప్తి రెస్టారెంట్ బార్‌లో మద్యం సేవిస్తుండగా, రాజేష్ స్నేహితుడు సతీష్ అక్కడికి వచ్చి గొడవపడి అతని తలపై బీరు బాటిల్‌తో కొట్టాడు. దీంతో రాముకి గాయాలయ్యాయి కాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. తర్వాత రాము... సతీష్ ఇంటికి వెళ్ళి గొడవ పడ్డాడు. ఇదిలావుండగా, కుంచయ్య, సతీష్, రాజేష్‌లు సన్నిహితంగా మెలిగేవారని, ఇది గమనించిన రాము... తనకు వ్యతిరేకంగా ఏదో ప్లాన్ చేస్తున్నారని భావించి తన తనతో చెప్పినట్టు ఫిర్యాదులో రాము భరణికా మహేశ్వరి యోచన దేవి పేర్కొంది. దీనికి సంబంధించి ఈ నెల 16న సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో కుంచయ్య తన భర్తను గణేష్ విగ్రహాల నిమజ్జనానికి వెళ్ళాలని పిలిస్తే వెళ్ళారని, అదే రోజు అర్ధరాత్రి దాటినా భర్త రాకపోవడంతో, రాము సెల్ ఫోన్ కి కాల్ చేయగా గాయాలతో భర్త కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని వెంటనే కేజీహెచ్‌కు ఆమె వెళ్ళింది.

రాము, కుంచయ్య బైక్‌పై అఫీషియల్ కాలనీ ఫస్ట్‌లైన్‌కు వెళ్ళగా రాజేష్, సతీష్, అప్పన్న మరో బైక్‌పై వెళ్ళారు. రాజేష్, సతీష్ కత్తులు తీసి రాము మెడ, ముఖం, శరీరంపై ఇతర భాగాలపై దాడి చేశారు. విచక్షణారహితంగా కత్తులతో దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలైన రాముని స్నేహితులు హరి, చిన్ని తదితరులు కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటాక రాము మృతి చెందాడు. రాజేష్, సతీష్, అప్పన్న, కుంచయ్య పథకం వేసి రాముని హత్య చేశారని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు పై నలుగురిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ భాస్కరరావు నేతృత్వంలో వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంఎంఈ కొత్త పాలసీలో సామాజిక న్యాయం

- దశల వారీగా ఎంఎంఈలు పెండింగ్ సబ్సిడీ నిధులు విడుదల చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,మహానాడు:

ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ప్రత్యేకంగా ఎంఎంఈ లు పాలసీ లేదు. మొదటిసారి ఓ చరిత్ర. ఎంఎంఈ ల సమగ్ర అభివృద్ధికి కొత్త పాలసీలో అన్ని అంశాలను పొందుపరిచారు.పాలసీ అద్భుతంగా ఉంది. రాష్ట్ర, ఎంఎంఈ ల అభివృద్ధికి కొత్త పాలసీ దోహదపడుతుంది.ఎంఎంఈ లను అభివృద్ధి చేయాలని మా నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ తాజ్ డెక్కన్ హెూటల్ సమావేశంలో దిశ నిర్దేశం చేశారు. సీఎం కొత్త పాలసీ తెచ్చారు. ఎంఎంఈ కంపెనీ ల్లో టేక్ ఓవర్ ప్రమాదం లేదు.

రాష్ట్రంలో కొత్త ఆవిష్కరణల కోసం మంత్రి శ్రీధర్ బాబు నిత్యం శ్రమిస్తున్నారు. గత ప్రభుత్వాలు అట్టహాసంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సబ్సిడీ ప్రకటించి ఒక రూపాయి కూడా ఇవ్వలేదు.. రాబోయే రోజుల్లో వారిని ప్రోత్సహించేందుకు పెండింగ్ లో ఉన్న సుమారు 2000 కోట్ల నిధులను దశలవారీగా మా ప్రభుత్వం విడుదల చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

శిల్పకళా వేదికలో ఏర్పాటుచేసిన ఎంఎంఈ నూతన పాలసీ ఆవిష్కరణ సభలో ప్రసంగించారు. కొత్త పాలసీలో సామాజిక న్యాయం కనిపిస్తుంది అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. కొత్త పాలసీ అద్భుతంగా ఉంది, ఇది రాష్ట్ర అభివృద్ధితో పాటు రాష్ట్రంలోని చిన్న మధ్యతరహా పరిశ్రమలపై ఆధారపడిన వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది అన్నారు. తెలుగు రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఒక ప్రత్యేక పాలసీ లేదు.

కేవలం పారిశ్రామిక పాలసీ మాత్రమే ఉండేది, కానీ మా ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఒక కొత్త పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్ర, దేశ జిడిపి పెరుగుదలకు చిన్న మధ్య తరహా పరిశ్రమలు దోహదపడతాయి, వీటిని ప్రోత్సహిస్తే పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి అన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను గురించి మా నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాదులోని తాజ్ డెక్కన్ లో





ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించి దేశ ఆర్థిక సమగ్ర అభివృద్ధికి ఈ పరిశ్రమలు దోహదపడతాయని అవగాహన కల్పించారని వివరించారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడి ఇగో ఇది మా విధానం అని స్పష్టంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలపై మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది అనడానికి ప్రత్యేక పాలసీని తీసుకురావడమే అందుకు నిదర్శనం అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖామంత్రి శ్రీధర్ బాబు దావోస్ పర్యటనలో 45 నుంచి 50 వేల కోట్ల మేర ఎంఓఏలు కుదుర్చుకున్నారు, ఇటీవల అమెరికా కొరియా దేశాల్లో పర్యటించి 36 వేల కోట్ల విలువైన ఎంఓఏలు కుదుర్చుకున్నారు.. అన్ని సదుపాయాలు కల్పిస్తామని మల్టీ నేషనల్ కంపెనీలను ఆహ్వానించారు.

ఈ నేపథ్యంలో చిన్నా మధ్యతరహా పరిశ్రమల పరిస్థితి ఏంటి అని నేను ఆలోచిస్తున్న సమయంలో చిన్న తరహా పరిశ్రమలపై దృష్టి పెట్టి భూ సదుపాయం, మహిళలకు రిజర్వేషన్లు, ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక కోటా, డబ్బు రాయితీని 75 లక్షల నుంచి ఒక కోటి రూపాయలకు పెంచారు.. చిన్న మధ్యతరహా పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది అనడానికి ఇవే ఉదాహరణలు అన్నారు.

రాష్ట్రంలో భారీ చిన్న పరిశ్రమలు మేలు కలయికగా ముందుకు వెళ్లి ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

చిన్న మధ్య పరిశ్రమలు హైదరాబాద్ రావడానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణం అన్నారు. బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, డి ఆర్ డి ఓ, ఐడిపిఎల్ వంటి భారీ పరిశ్రమలు హైదరాబాదులో నెలకొల్పాగా వాటికి అనుసంధానంగా చిన్న మధ్య తరహా పరిశ్రమలు హైదరాబాదులో పెద్ద ఎత్తున ఆవిర్భవించాయని తెలిపారు.

చాలా రాష్ట్రాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతపడుతున్నాయి. గుజరాత్లో 1626, మహారాష్ట్రలో 5082, తమిళనాడులో 2486 పరిశ్రమలు మూతపడ్డాయి. అదే తెలంగాణలో చూస్తే 231 పరిశ్రమలు మాత్రమే మూతపడ్డాయి. స్థానికంగా వాతావరణం, అవకాశాలు, మానవ వనరులు పుష్కలంగా ఉండడంతోనే తెలంగాణలో తక్కువ సంఖ్యలో చిన్న ,మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని వివరించారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో పెద్ద కంపెనీలల్లో ఒక కంపెనీ మరో కంపెనీని టేక్ ఓవర్ చేస్తాయి, అదే చిన్న, మధ్య తరహా పరిశ్రమల విషయంలో టేక్ ఓవర్ ఆందోళన అవసరం లేదు అన్నారు.

రాష్ట్రంలో చిన్న మధ్య తరహా పరిశ్రమల దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని, టాటా కంపెనీ సహకారంతో ఐటిఐ లను ఆధునికరించిందన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ ఇచ్చి ఇంజనీరింగ్ విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.

రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక కొత్త విధానాన్ని పరిచయం చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నిత్యం శ్రమిస్తున్నారని అభినందించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సదస్సును ఇటీవల హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారని తెలిపారు. తాజాగా కొత్త పాలసీని ఆవిష్కరించారని వివరించారు.

## ఉద్యోగులకు వరంగా మారనున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీం కొత్త ప్రతిపాదన

- రూపొందించిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ
- వైద్య శాఖ మంత్రికి సమర్పించిన చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- తొలగిపోనున్న మెడికల్ రీయిబర్స్‌మెంట్ ఇబ్బందులు
- ఆపద సమయంలో ఉద్యోగులపై ఆర్థిక భారం లేకుండా చర్యలు
- అపరిమిత నగదు రహిత సేవలతో ఈహెచ్ఎస్ అమలు చేయాలని సూచన
- జీవో నం.317ను రద్దు చేసి బాధిత ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్,మహానాడు:

తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు, ఫెన్షనర్లు, వారిపై ఆధార పడ్డ కుటుంబ సభ్యుల కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్



(ఈహెచ్ఎస్)ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది.

ఈ మేరకు వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి నూతన ఈహెచ్ఎస్ విధానం అమలు కోసం ఒక ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, పలువురు జేఏసీ నాయకులు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ కి బుధవారం అందజేశారు.

ఈ సందర్భంగా లచ్చిరెడ్డి ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న హెల్త్ స్కీంలో ఉన్న లోటు పాట్లు, కొత్తగా ప్రతిపాదించిన హెల్త్ స్కీంతో ఉద్యోగులకు, వారి కుటుంబాలకు కలిగే ప్రయోజనాలు, తద్వారా ప్రభుత్వానికి వచ్చే పేరు గురించి మంత్రికి వివరించారు.

కొత్త ప్రతిపాదనలతో ప్రభుత్వానికి భారం లేకుండా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందే వైద్య సేవల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

దీంతోపాటు రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీవోతో ఉద్యోగులు పడుతున్న కష్టనష్టాల గురించి మంత్రికి వివరించారు. వెంటనే జీవో నెంబర్ 317 ను రద్దుచేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని మంత్రిని లచ్చిరెడ్డి కోరారు.

## దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం

- మెరుగైన ఆవిష్కరణతో అమ్మవారి దర్శనం ఏర్పాట్లు
- సామాన్య భక్తులకు సంతృప్తికర అమ్మవారి దర్శనమే లక్ష్యం
- అధికారుల సమన్వయంతో దసరా ఉత్సవాల విజయవంతానికి కృషి
- ఎన్‌టిఆర్ జిల్లా జిల్లా కలెక్టర్ డా. జి. సృజన, పోలీస్ కమీషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు,ఎంఎల్ఎ వై. సుజనా చౌదరి

విజయవాడ, మహానాడు:

సామాన్య భక్తులకు సంతృప్తికర అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు ఎటువంటి లోటుపాట్ల కు తావు లేకుండా అధికారులు సమన్వయంతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అందుకు తగిన ఏర్పాట్లను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశించారు.

అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, శాసనసభ్యులు వై. సుజనా చౌదరి లు సంబంధిత శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి పై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. భక్తుల మనోభావాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సామాన్య భక్తులకు సైతం సంతృప్తి కరమైన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా ఇప్పటికే దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుందని అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా మరింత అప్రమత్తంగా అధికారులు ఉండాలన్నారు.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. దసరా ఉత్సవాలలో ప్రతి రోజు లక్ష మందికి పైగా మూలా నక్షత్రం రోజు రెండు నుండి మూడు లక్షల మంది వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

క్యూలైన్‌లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దాతల సహకారంతో త్రాగునీరు, పాలు, అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూలా నక్షత్రం రోజు అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున గౌరవ ముఖ్యమంత్రి వర్యులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి. సృజన తెలిపారు.

పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలలో రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాధి మంది అమ్మవారి దర్శనానికి తరలివస్తారన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు చెందిన పోలీసులతో పాటు ఇతర జిల్లాల నుండి 3,500 మంది సిబ్బంది సేవలను దసరా ఉత్సవాలలో వినియోగించనున్నామన్నారు.

ఏర్పాట్ల పరిశీలనకు ప్రతి నిర్ణీత ప్రాంతం, సెక్టార్ (రంగం)కి ఒక ప్రత్యేక అధికారి పరిశీలనలో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. దుర్గా ఘాట్ సమీపంలో గల కమాండ్ కంట్రోల్ ద్వారా దసరా ఉత్సవాల నిర్వహణను ఎప్పటికప్పుడు



పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

స్థానిక శాసనసభ్యులు వై.సుజనా చౌదరి మాట్లాడుతూ.. గతం కంటే మరింత మెరుగ్గా దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు భక్తుల సలహాలు సూచనలు పొందేందుకు ప్రత్యేక వైబ్ సైట్‌ను రూపొందించాలని తెలిపారు. వృద్ధులు, విభిన్నప్రతిభావంతులు విఐపిలు, వివి ఐపిలకు ప్రత్యేక ట్కెమ్ స్లాట్‌లను కేటాయించి వారికి ముందుగానే తెలియపరిచి ఆయా సమయాలలోనే అమ్మవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటే సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉంటాయని ఆయన సూచించారు. భక్తులకు హెూల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసి నిరీక్షణ లేకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఆలయ ఈవో కె.ఎస్. రామరావు.. మాట్లాడుతూ ఈ ఉత్సవాలలో అమ్మవారు పది అవతారాలలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారన్నారు. అక్టోబర్ 3వ తేదీన శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి, 4న శ్రీ గాయత్రీ దేవి, 5న అన్నపూర్ణ దేవి, 6న శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి, 7న శ్రీ మహాచండీ దేవి, 8న శ్రీ మహాలక్ష్మి దేవి, 9న శ్రీ సరస్వతి దేవి, (మూలా నక్షత్రం) 10న శ్రీ దుర్గాదేవి, 11న శ్రీ మహిషాశురమర్ధినీ దేవి, 12న శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి అలంకారంతో దర్శనం ఇస్తారన్నారు.

అక్టోబర్ 9వ తేదీన అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారన్నారు. ఆన్లైన్ టికెట్ లేకుండా వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రిసెప్షన్, టోల్‌గేట్, హెూమ్ టర్నింగ్, పున్నమి ఘాట్, వియంసి ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, స్టేట్ గెస్ట్ హౌస్, మోడల్ గెస్ట్ హౌస్, హెడ్ వాటర్ వర్క్స్, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల వద్ద కరెంటు టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

వినాయకుడి గుడి నుండి టోల్‌గేట్ ద్వారా కొండపైన హెూం టర్నింగ్ వరకు మూడు క్యూ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓం టర్నింగ్ వద్ద ఉచిత దర్శనం, వి ఐ పి క్యూ లైన్లతో కలిపి మొత్తం 5 క్యూ లైన్లు ఉంటాయన్నారు. భక్తులకు త్రాగునీరు అందించేందుకు ఈ ఏడాది వాటర్ ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిల్సు సరఫరా చేయనున్నామన్నారు.

కనకదుర్గానగర వద్ద ప్రత్యేక ప్రసాదం కౌంటర్లుతో పాటు కొండపైన ఓం టర్నింగ్ వద్ద ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని 25 లక్షల లడ్డులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రథం సెంటర్, మున్సిపల్ ఆఫీసు, సీతమ్మ వారి పాదాలు, కుమ్మరి పాలెం, పున్నమి ఘాట్ వద్ద ఉచిత చెప్పుల స్టాండ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు స్నానమాచరించేందుకు సీతమ్మ వారి పాదాల వద్ద 500 షవర్స్, పున్నమి ఘాటు వద్ద 100, భవాని ఘాట్ వద్ద 100 షవర్స్‌లతో పాటు 150 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

భక్తులకు అమ్మవారి ఉచిత ప్రసాదం కింద పులిహెూర, కట్టు పొంగలి, దద్దోజనం, సాంబారు అన్నం మహామండపం ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, సూచనలు సలహాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది సహకారంతో దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని ఆలయ ఈవో అన్నారు.

సమావేశంలో డిసిపిలు గౌతమి శాలి, యం. కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డిసిపిలు జి.రామకృష్ణ, యం.రాజరావు, డిఆర్‌వో వి. శ్రీనివాసరావు, ఆర్‌డివో భవాని శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, దేవస్థానం ఈఈలు ఎల్. రమ, కోటేశ్వరరావు, వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||




# ఆకస్మిక వరదలు ప్రజా జీవితాలను అస్తవ్యస్తం చేశాయి

- వరద ప్రభావిత ప్రాంత ఎస్టీల జీవనోపాధిని దెబ్బతీశాయి.
- ముంపుతో సంభవించిన కష్టనష్టాలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక
- ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిన ప్రభుత్వానికి కమిషన్ తరపున ధన్యవాదాలు
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డీవీజీ శంకరరావు



విజయవాడ,మహానాడు:

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేశాయని... ఎస్టీల జీవనోపాధిని బాగా దెబ్బతీశాయని, వాస్తవ స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డీవీజీ శంకర రావు తెలిపారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డీవీజీ శంకరరావు బుధవారం ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్‌తో కలిసి విజయవాడ అర్బన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరిపేట, వాంబే కాలనీ, జక్కంపూడి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. వరదల కారణంగా ఆదివాసీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వరద ప్రభావం తెచ్చిపెట్టిన కష్టాల నుంచి బాధితులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అందిన సహాయసహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అభివృద్ధిలో వెనకున్న ఆదివాసీలకు వరద మరిన్ని కష్టాలను తెచ్చిపెట్టిందని.. వరద ప్రభావంవల్ల ఎస్టీలకు జరిగిన కష్టనష్టాలను తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు వివరించారు. పూసలు అమ్ముకొంటూ, ఆటోలు నడుపుకుంటూ, చాలా చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఎస్టీలు జీవిస్తున్నారని.. వరదల వల్ల వారి జీవనోపాధికి చాలా ఇబ్బంది కలిగిందన్నారు.

ముడిసరుకు నీటిపాలై ఆర్థిక సమస్యలు తలెత్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు బాధితులను ఆదుకునేందుకు కృషిచేస్తున్నాయని.. బాధితులకు జరిగిన నష్టాన్ని ఎన్యూమరేషన్ చేసి, ప్యాకేజీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్టీ కమిషన్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ పథకాలన్నీ అందేలా కృషి:

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, ఎస్టీలతో మాట్లాడటం జరిగిందని, ఆధార్, రేషన్ కార్డులు, పెన్షన్ వంటివి లేవని కొందరు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తెచ్చారని.. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా, ప్రజా క్షేమానికి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ అందేలా కృషిచేయనున్నట్లు తెలిపారు. ఎస్టీలు సమాజంలో మిగిలిన వారితో సమానంగా ఎదిగేందుకు కమిషన్ కృషిచేస్తున్నట్లు డా.డీవీజీ శంకరరావు పేర్కొన్నారు.

వాంబే కాలనీలో సందర్శించిన సమయంలో ఎస్టీలు కమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతూ తాము చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ బతుకుతున్నామని.. వరద సమయంలో ప్రభుత్వం సహాయసహకారాలు అందించిందని, హెలికాప్టర్లను సైతం మాదగ్గరికి పంపి ఆహారాన్ని అందించారని తెలిపారు. రేషన్ కూడా ఇచ్చారని వివరించారు.

పర్యటనలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ కార్యదర్శి కె.రామశేషు, ఏవో ఎం.విజయ్ కుమార్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) ప్రెసిడెంట్ మానుపాటి నవీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ కె.రామచంద్రయ్య, ఎస్టీ సంక్షేమ సంఘం నేత ఉదయ్ కుమార్, విజయవాడ నార్త్ తహశీల్దార్ సీహెచ్ శిరీషా దేవి, రూరల్ తహశీల్దార్ బి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.





# ఏరియా ఆస్పత్రే నా మానస పుత్రిక

- సమీక్షా సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మహానాడు:

ఏరియా ఆస్పత్రే నా మానస పుత్రిక... దీన్ని చెడగొట్టేందుకు ప్రయత్నం చేస్తే సహించేది లేదని భావోద్వేగంతో మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు. కలెక్టర్ విజయ్ కృష్ణణ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. ఆస్పత్రిలో రోగులకు సేవ చేయడం వైద్యులకు దేవుడిచ్చిన వరమని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే, నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకురావడం తన లక్ష్యమని పేర్కొన్నారు.

తన హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల గురించి, లిఫ్ట్, మొబైల్ బ్లడ్ బ్యాంక్, ఆర్థోపెడిక్ ఎక్స్-రే, డయాలసిస్ యూనిట్ తదితర విషయాలపై వివరించారు. అయిదేళ్ళకాలంలో ఆస్పత్రి నుంచి 6,000 మంది గర్భిణులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపారని అన్నారు. 2018లో నెలకు 500 డెలివరీలు జరిగేవి, ఇప్పుడు ఎంత జరుగుతున్నాయని ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ నీలవేణిని ప్రశ్నించారు. కొత్త ఎమ్మెల్యే ఇంకా ప్రమాణ స్వీకారం చేసి మూడు నెలలైనా కమిటీ వేయకపోవడంపై కూడా ప్రశ్నించారు. ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను పంపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మొబైల్ బ్లడ్ బ్యాంక్ ద్వారా గత అయిదేళ్ళకాలంలో ఎన్ని యూనిట్ల రక్తం సేకరించారో తెలియజేయాలని కోరారు. ఆస్పత్రి సిబ్బంది డబ్బులు వసూలు ఆరోపణలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. స్వల్పసేవల నిర్వహణలో లోపాలపై శ్రద్ధ వహించాలని, ప్రైవేటు ఆంబులెన్స్ లకు ప్రత్యేక ధర నిర్ణయించాలని సూచించారు. ఆయుష్ హాస్పిటల్ పూర్తయి అయిదేళ్ళు అవుతున్న నిరుపయోగంగా ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. హాస్పటల్ లో శస్త్ర చికిత్స కు కావలసిన పరికరాలు, మరొక ఆరో వాటర్ ప్లాంట్ హాస్పటల్ కు సమకూర్చుతానని స్పీకర్ తెలిపారు.

కలెక్టర్ విజయ్ కృష్ణణ్ మాట్లాడుతూ, ఆస్పత్రికి కొత్త అంబులెన్స్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా, స్నేక్ బైట్ కేసును ఎందుకు ప్రైవేటు ఆస్పత్రికి పంపారో విచారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డీసీహెచ్ ఎస్.శంకర్ ప్రసాద్, ఆర్డీవో జయరాం, జనసేన ఇన్‌చార్జీ సూర్యచంద్ర పాల్గొన్నారు.

# బోట్ల తొలగింపు విజయవంతం

- ఒడ్డుకు చేర్చిన ఇంజినీర్లు

విజయవాడ, మహానాడు:



ప్రకాశం బ్యారేజీ వద్ద చిక్కుకున్న బోట్ల తొలగింపు ప్రక్రియ విజయవంతం అయింది. చివరగా మిగిలిపోయిన 40 టన్నుల భారీ బోటును బెకెం ఇన్‌ఫ్రా సంస్థ ఇంజినీర్లు ఒడ్డుకు చేర్చారు. 2 పడవలు ఇనుప గడ్డర్లతో అనుసంధానించి, వీటికి అదనంగా మరో 2 భారీ పడవలు అనుసంధా నించి లాగడం ద్వారా బ్యారేజీ గేటు నుంచి బోటును తొలగించారు. గేట్ల వద్ద అడ్డుపడిన పడవలను బయటకు తీసేందుకు ఏడు రోజులుగా ఇంజినీర్లు, అధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. తాజాగా బోట్ల తొలగింపు ప్రక్రియలో పురోగతి ఇంజినీర్లు పురోగతి సాధించారు. నాలుగు భారీ పడవల సాయంతో బోటును బయటకు తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు.

భారీ పడవలతో లాగడంతో బోటు కదిలింది. అదే విధంగా తొలుత 30 మీటర్ల మేర ముందుకు కదిలింది. అనంతరం బ్యారేజీ గేటు నుంచి అర కిలోమీటర్ మేర నదిలోకి లాక్కెళ్లారు. అక్కడ నుంచి ఇంజినీర్లు, అధికారులు బోటును ఒడ్డుకు చేర్చారు. ఈ ప్రక్రియలో తొలత పడవను చైన్ పుల్లర్లతో ఎత్తుకు లేపారు. నీట మునిగిన పడవను పైకి తీసుకొచ్చారు. నది అడుగు నుంచి 10 అడుగులపైకి తీసుకొచ్చి, బ్యారేజ్ గేటు నుంచి ఒడ్డుకు చేర్చారు.

తొలుత వివిధ ప్రణాళికలతో ప్రయత్నం చేసిన అనంతరం, సరికొత్త ప్రణాళికతో బెకెం ఇన్‌ఫ్రా ఇంజినీర్లు భారీ బోటును ఒడ్డుకు తెచ్చారు. ఇంకా బ్యారేజీ వద్ద 2 భారీ, ఒక మోస్తరు బోటు అడ్డుపడి చిక్కుకుని ఉన్నాయి. మిగిలిన భారీ బోట్లను ఇదే విధానంలో బయటకు తీసే ప్రక్రియను బెకెం సంస్థ ఇంజినీర్లు కొనసాగించనున్నారు. ఇసుక, నీరు బోటులోకి చేరికతో 100 టన్నులకు బోటు బరువు పెరిగింది. బోటు బరువు భారీగా ఉండటంతో సరికొత్త విధానం అమలు చేసిన అధికారులు, రెండు బోట్లకు అదనంగా మరో 2 బోట్లను అనుసంధానించారు. ఈ విధంగా పడవను లాగుతూ ఒడ్డుకు తేవడంలో అధికారులు విజయవంతమయ్యారు.

వంద టన్నుల బరువు ఎత్తే రెండు భారీ క్రేన్లతో బోట్లకు కట్టి ఎత్తే ప్రయత్నం చేయగా విఫలమైంది. డైవింగ్ టీంలతో బోటును రెండు భాగాలుగా కోసి బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. భారీ పడవలను వెలికి తీయడంలో అనుభవం ఉన్న, కాకినాడకు చెందిన అబ్బులు టీం రంగంలోకి దిగి భారీ పడవలకు రోప్‌లను కట్టి వెనక్కు లాగగా 20 మీటర్లు వెనక్కి వచ్చిలో ఇసుకలో చిక్కుకుని రాలేదు. ఆదివారం పొక్లయిన్‌కు రోప్‌లు కట్టి రోజంతా లాగినా కేవలం 5 మీటర్లు మాత్రమే కదిలి రాకుండా మొరాయించింది. దీంతో సోమవారం ప్లాన్ 5ను అమలు చేశారు. దీంతో ఇది విజయవంతం అయింది.

కాగా ఈనెల 1వ తేదీన భారీ ప్రవాహానికి ఎగువ నుంచి కొట్టుకువచ్చిన 5 బోట్లు బ్యారేజీ గేట్లను బలంగా ఢీకొట్టాయి. దీంతో 67, 69, 70 గేట్ల వద్ద కౌంటర్ వెయిట్లు ధ్వంసమయ్యాయి. ప్రవాహంలో ఒక పడవ దిగువకు కొట్టుకు పోగా, మరో 3 భారీ పడవలు, ఒక మోస్తరు పడవ గేట్లవద్దే చిక్కుకున్నాయి. ఈ బోట్లు బ్యారేజీ గేట్లకు అడ్డుపడి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీంతో భారీ పడవలను తొలగించేందుకు పలు ప్లాన్? అమలు చేసిన అధికారులు, తాజాగా సఫలీకృతం అయ్యారు.

## మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

- మంత్రి, సీఎంకు కృతజ్ఞతలు

మంగళగిరి, మహానాడు:

మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటుపై వారు హర్షం వ్యక్తం చేశారు. యువగళంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంపై మంత్రి నారా లోకేష్, సీఎం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీని అమలు చేయడం పట్ల లక్షా 10వేల మాజీ సైనిక కుటుంబాల తరఫున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపుతూ.. ఇక్కడి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.


మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో.. కూటమి నేతలు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తారంటూ అందులో ఎటువంటి సందేహం లేదన్నారు. జీవోనెంబర్ 57, 191 లను కూడా ప్రభుత్వం అమలు చేసి తమకు మేలు చేయాలన్నారు. జీవో నెంబర్ 357 ప్రకారం ప్రభుత్వం నియమించే నియామకాల్లో 2% ఉద్యోగాలను మాజీ సైనికులకు కేటాయించినా దాన్ని అమలు చేయలేదని.. దాన్ని కూడా అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సైనికుల సమస్యలను అసలు పట్టించుకోలేదన్నారు. మాజీ సైనికులకు హక్కుగా వస్తున్న జాబులను తమకు అందేలా చూడాలన్నారు. గ్రూప్ 1 గ్రూప్ 2లలో 2% రిజర్వేషన్‌ను 5 శాతంకు, గ్రూప్ 3, గ్రూప్ 4 లలో 10% శాతంకు పెంచాలని వారు అభ్యర్థించారు. మాజీ సైనికులందరిని ఓసీలుగా పరిగణిస్తున్నారని.. అన్ని కులాల వారు అందులో ఉన్నా ఓసీలుగా పరిగణించడంతో మాజీ సైనికులకు దక్కాల్సిన ఉద్యోగాలు దక్కడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# 100 రోజులు!

- అభివృద్ధి జట్టు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు
- గొప్ప ప్రణాళికలు డబుల్ ఇంజన్ సర్కార్ సొంతం
- వందేళ్ళ దేశ, రాష్ట్ర భవిష్యత్ వైపు అడుగులు
- వికసిత భారత్, వికసిత ఆంధ్ర వైపు ప్రయాణం
- ఏపీ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్

విజయవాడ, మహానాడు: దేశం, రాష్ట్రం సంపూర్ణ సంక్షేమం, అభివృద్ధికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు జట్టుగా ఏర్పడి పాలనలో దూసుకుపోతున్నారని, ఈ 100 రోజుల అడుగులు 100 ఏళ్ళ దేశ, రాష్ట్ర భవిష్యత్తు వైపు ఆశ కల్పిస్తున్నాయని, కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాలు డబుల్ ఇంజన్‌తో ప్రయాణం సాగిస్తున్నారని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు.

ఆయన ఏమన్నారంటే...




వికసిత భారత్, రాష్ట్రంలో వికసిత ఆంధ్ర వైపు ప్రయాణం సుస్పష్టం.

ప్రధాని మోడీ దేశంలో 15 లక్షల కోట్ల మౌలిక సదుపాయాల లక్ష్యంగా 100 రోజుల్లో మూడు లక్షల కోట్ల ప్రాజెక్టులకు అంకురార్పణ. 100 రోజుల్లో సీఎం చంద్రబాబు నాయుడు అమరావతి, పోలవరం నిర్మాణం పూర్తి చేయడానికి ప్రణాళికలు వేగవంతం చేశారు. 100 రోజులలో రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ పంచాయితీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేశారు.

దేశంలో పేదలకు మూడు కోట్ల కొత్త గృహాల నిర్మాణం, 80 కోట్ల మందికి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కొనసాగింపు, మహిళలను లాక్ పతి దీదీలుగా అభివృద్ధి కోసం ప్రధాని మోదీ అడుగులు వేశారు. 100 రోజులలో అన్న క్యాంటీన్లతో పేదలకు ఆహారం, అర్హులైన వారికి 4000 పెన్షన్, అకాల వరదలతో అతలాకుతలమైన ప్రజలను ఆదుకోవడం వంటి సేవలను సీఎం చంద్రబాబు నాయుడు అందించారు. దేశం మొత్తం 2030 నాటికి ప్రధాని గ్రీన్ ఎనర్జీ పెట్టుబడుల లక్ష్యం 30 లక్షల కోట్లయితే అందులో 10 లక్షల కోట్లు ఏపీ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించడం శుభాపరిణామం.









# ఉద్యోగం పేరుతో రూ. 25 లక్షలు కొట్టేసి లండన్ తీసుకెళ్ళి వదిలేశారు..

- బిల్లులు రాక అప్పులు చెల్లించలేక ఆత్మహత్య
- గ్రీవెన్స్‌లో బోరుమన్న బాధితులు

మంగళగిరి, మహానాడు:

తన అల్లుడికి లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తమ వద్ద రూ. 25 లక్షలు తీసుకుని మోసం చేశారని... తన అల్లుడిని లండన్ తీసుకెళ్లి ఉద్యోగం ఇప్పించకుండా అక్కడ వదిలేయడంతో 18 నెలల పాటు నానా ఇబ్బందులు పడి రావాల్సి వచ్చిందని.. ఈ మోసం తెలిసి తన అల్లుడి తండ్రి గుండెపోటుతో మరణించారని... ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన మాజేటి అశోక్ పై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని, తమకు న్యాయం చేసి డబ్బులు ఇప్పించాలని గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం అమినా బాదు గ్రామానికి చెందిన బత్తుల గాయత్రీ దేవి గ్రీవెన్స్‌లో వేడుకున్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన గ్రీవెన్స్ లో నేతలను కలిసి అర్జీ ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదుపై స్పందించిన మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు వెంటనే డీఎస్పీకి ఫోన్ చేసి సమస్యను తెలిపి పరిష్కరించాలని కోరారు. ఉద్యోగాలపేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ పాల్గొని అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు.

- వినుకొండ నియోజకవర్గంలో 2014-2019 సంవత్సరంలో MGNREGS గ్రాంటు కింద సిమ్మెంట్ రోడ్ల పనులు చేశామని.. ఆ బిల్లులు నేటికి రాలేదని.. బిల్లులు రాక అప్పులు కట్టలేక ఈపురుపాలెం మండలంలో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి కూడా ఉందని బాధితులు తెలిపారు. దయ చేసి తమకు రావాల్సిన బిల్లుల బకాయిలు రూ. 36.50 కోట్లను వెంటనే విడుదల చేయాలని, వినుకొండ నుండి వచ్చిన బాధితులు గ్రీవెన్స్‌లో నేతలకు వినతిపత్రం ఇచ్చి అభ్యర్థించారు. గంగినేని చంద్రశేఖర్, ముంద్రు సుబ్బారావు తమ గోడును వినిపిస్తూ.. బిల్లులు రాకపోవడంతో పిల్లల్ని బడులకు కూడా పంపలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.
- ఎన్టీఆర్ జిల్లా విజయవాడ న్యూ రాజీవ్ నగర్ 63వ డివిజన్‌కు చెందిన పొదిలి తిరుపతయ్య విజ్ఞప్తి చేస్తూ.. మొన్నటి వరదల్లో ఇల్లు మొత్తం మునిగిపోయి కట్టుబట్టలతో మిగిలామని.. రూ. 2 లక్షల రూపాయాలు నష్టం జరిగిందని పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు.
- కృష్ణా జిల్లా కానూరుకు చెందిన కొక్కిలిగడ్డ ఏసోబు విజ్ఞప్తి చేస్తూ.. తనకు పుట్టుకతోనే పోలియో ఉందని.. తనకు చెప్పుల షాపు పెట్టుకోవడానికి స్సబిడీపై రుణం ఇప్పించాలని అభ్యర్థించారు.
- తాము 1985 లో కొనుగోలు చేసి రిజిస్టర్ అయిన భూములను చుక్కల భూములగా మార్చడంతో ఇబ్బంది పడుతున్నామని.. ఈ విషయాన్ని తహశీల్దార్ వద్దకు తీసుకెళ్తే పట్టించుకోవడంలేదని.. కానీ ఊరిలో చాలా మందికి ఇలాంటి భూములను చుక్కల భూమల నుండి తీసి రెగ్యులర్ చేశారని.. వైసీపీ నేతలు తహశీల్దార్ కు చెప్పడంతోనే తమ భూమిని రెగ్యులర్ చేయడంలేదని నెల్లూరు జిల్లా కావలి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాటిబండ్ల శ్రీనివాసులు తెలిపారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు.
- నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కొత్తపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాజశేఖర్ విజ్ఞప్తి చేస్తూ.. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తమ భూములను 22 ఏలోకి మార్చారని.. దాన్ని తొలగించి తమకు ఫ్రీహోల్డ్ చేయాలని అతను గ్రీవెన్స్‌లో నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు.
- కర్నూలు జిల్లా ఆదోని మండలం గణేకల్లు గ్రామానికి చెందిన బి.పెద్ద విరూపాక్షి విజ్ఞప్తి చేస్తూ.. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు హౌసింగ్ బోర్డు తరపున ఇళ్ళు కట్టుకుంటే గత వైసీపీ ప్రభుత్వంలో వారికి బిల్లులు పడకుండా అడ్డుకున్నారని, బిల్లులు పడకపోవడంతో 54 మంది కార్యకర్తలు అప్పుల పాలయ్యారని వారికి బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు.
- అధికారుల అండతో తన భూమిని ఆక్రమించుకుని అక్రమంగా తన భూమిలో మట్టిని తోడి పొలాన్ని చెరువును చేశారంటూ.. గుంటూరు జిల్లా పెద్ద కాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన విజయ భాస్కరరావు గ్రీవెన్స్‌లో లబోదిబోమ న్నారు. తన భూమిని ఆక్రమించి మట్టిని తోడేసిన భూ కబ్జా దారులు, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.
- కడప జిల్లా, కడపకు చెందిన పి.రమాదేవి విజ్ఞప్తి చేస్తూ.. రాజీవ్ గృహకల్ప కింద వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కట్టిన డ్రైన్‌లు నిండిపోయి మురుగు ఎటూ పోవడంలేదని.. గత ఐదేళ్ళు ఆ డ్రైన్ల ను ఎవరూ పట్టించుకోకపోవడంతో పాములు, తేళ్ళు బయటకు వస్తున్నాయని.. వాటి కాటుకు గురై పిల్లలు పెద్దలు ఆసుపత్రుల పాలు కావాల్సి వస్తోందని.. దయచేసి సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.
- గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం నవులూరులో తమ ఇల్లు కబ్జా చేశారని.. కబ్జాదారుడి నుండి తమ ఇంటిని విడిపించాలని గ్రీవెన్స్‌లో సరోజిని వేడుకున్నారు.
- ఈ అర్జీలతో పాటు పలువురు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం అర్జీలు అందించగా.. సీఎంఆర్ఎఫ్ అందించి ఆదుకోవాలని మరికొందరు వేడుకున్నారు. నామినేటెడ్ పదవుల కోసం పలువురు నేతలు అర్జీలు ఇచ్చారు.





జనం గుండె చప్పుడు
# మహానాడు
10
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||



## మాజీ మంత్రి
# ఆలపాటి అందలం...

### ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక - టీడీపీ హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్

**అమరావతి, మహానాడు:** గుంటూరు - కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఆలపాటి అభ్యర్థిత్వానికి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మంగళవారం పొద్దుపోయే వరకు జరిగిన పార్టీ ఇన్‌చార్జిల సమావేశంలో ఆలపాటి రాజా కు విషయం చెప్పిన అధిష్ఠానం. పట్టభద్రుల నియోజకవర్గంలో ఇప్పటినుంచే గ్రౌండ్ వర్క్ ప్రారంభించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పార్టీ పరంగా అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తామని అగ్రనేతలు హామీ ఇచ్చారు.




## పరిసరాల పరిశుభ్రతతోనే
# సంపూర్ణ ఆరోగ్యం

- **ఎమ్మెల్యే నజీర్ అహ్మద్**

**గుంటూరు, మహానాడు:** పట్టణంలో 146 & 145 ఆఫీస్ వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాలతో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ సూచనలతో 51 డివిజన్ కార్పొరేటర్ ముప్పవరపు భారతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, అలాగే డెంగ్యూ, మలేరియా వ్యాధుల నుండి పరిరక్షించుకోవచ్చని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మధు నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ హత్యకు కుట్ర!

- **బీజేపీ తీవ్రవాదుల పార్టీ**
- **వన్ టౌన్ గాంధీ విగ్రహం వద్ద ఏపీసీసీ భారీ నిరసన**
- **అనుచిత వ్యాఖ్యలపై ఆ పార్టీ క్షమాపణ చెప్పాలి**
- **పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపణ డిమాండ్**

**విజయవాడ, మహానాడు:** రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రతిపక్ష నేత... రాహుల్ గాంధీని చంపాలని బీజేపీ నాయకులు కామెంట్స్ చేస్తున్నారు... ఇంత దారుణంగా కామెంట్స్ చేస్తున్నా మోడీ, షాలు పట్టించుకోవడం లేదని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇదంతా వారి డైరెక్షన్ లోనే జరుగుతోంని, ఈ దుర్మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆమె అన్నారు. ఈ మేరకు బుధవారం వన్ టౌన్ గాంధీ విగ్రహం వద్ద ఏపీసీసీ భారీ నిరసన చేపట్టింది. ఈ కార్యక్రమంలో షర్మిలా పాల్గొని, మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే... ద్వేషపూరిత మాటలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. ఈ దేశంలో ఎవరు తీవ్రవాదులు? ఏది తీవ్రవాదం? ఈ దేశంలో అట్టడుగు వర్గాల వాళ్ళు 90 శాతం మంది ఉన్నారు. వాళ్ళకు అభివృద్ధి లో వాట లేదు అని చెప్పడం అని తీవ్రవాదమా? అందరికీ సమాన అవకాశాలు ఉండాలి అని చెప్పడం తీవ్రవాదమా? ఏది తీవ్రవాదమో బీజేపీ సమాధానం చెప్పాలి.

ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ. త్యాగాలు చేసింది కాంగ్రెస్ పార్టీ.

అన్ని కులాలను, మతాలను సమానంగా చూసింది కాంగ్రెస్ పార్టీ. ప్రజల హక్కుల కోసం పోరాటం చేసేది కాంగ్రెస్ పార్టీ. అన్ని మతాలకు, కులాలను సమానంగా చూసింది కాంగ్రెస్ పార్టీ. ఇలాంటి కాంగ్రెస్ పార్టీ గురించి



నీచంగా బీజేపీ మాట్లాడుతోంది. రాహుల్ గాంధీని తీవ్రవాది అంటున్నారు. రాహుల్ అమ్మమ్మ, నాన్న ఇద్దరు తీవ్రవాదుల చేతుల్లో బలి అయ్యారు. ఈ విషయం బీజేపీకి తెలియదా? రాహుల్ గాంధీ ఈ దేశంలో ప్రేమను నింపిన నాయకుడు. రాహుల్ గాంధీ పేరు ఉచ్చరించే హక్కు బీజేపీకి లేదు. బీజేపీ అంటే మతతత్వ పార్టీ. బీజేపీ మత చిచ్చు పార్టీ. బీజేపీ తీవ్రవాదుల పార్టీ. మతాల మధ్య చిచ్చుపెట్టాలి.. అందులో చలి కాచుకోవాలి. ఇదే బీజేపీ సిద్ధాంతం. ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం బీజేపీ తీవ్రవాది పార్టీ అనడానికి నిదర్శనం కాదా? కేవలం అగ్ర వర్ణాలకు కొమ్ము కాయడం తీవ్రవాదం అనిపించుకోదా?

**అణగారిన వర్గాలను తొక్కాలని బీజేపీ చూస్తుంది.**

ఈ దేశంలో రిజర్వేషన్లు గురించి మాట్లాడే హక్కు బీజేపీకి లేదు. బీజేపీ రాహుల్ గాంధీకి భయపడుతుంది. రాహుల్ పాదయాత్రతో ఈ దేశంలో ధైర్యం నింపాడు. బీజేపీ అంటే భారతీయ జుమ్లా పార్టీ. బీజేపీ అంటే భారతీయ జూట పార్టీ

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరించింది. ఈ దేశంలో బీజేపీ కి మించిన వేర్పాటు వాదుల పార్టీ ఇంకోటి ఉందా? మసీదుల మీద, చర్చ్‌ల మీద, క్రిస్టియన్లు, ముస్లింల మీద ఊచ కోత కోసిన టెర్రరిస్టు పార్టీ ఈ బీజేపీ కాదా? ముస్లీం రిజర్వేషన్లు రద్దు చేస్తాం అని చెప్పడం టెర్రరిజం అనరా? ఈ దేశంలో అగ్రవర్ణాల కొమ్ము గాస్తున్నది బీజేపీ కాదా ? కేవలం 10 శాతం మంది మీ తొత్తుల చేతుల్లోనే భారతీయ వ్యాపారం మొత్తం కేంద్రీకృతం కాలేదా?

కేంద్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి పోస్టుల్లో ఎంత మంది దళిత,గిరిజనులు ఉన్నారు? వెనుక బడిన విద్యార్థులకు స్కాలర్ షిప్స్ 40 శాతానికి ఎందుకు తగ్గించారు? ఓబీసీ విద్యార్థుల స్కాలర్ షిప్ లు ఎందుకు 15 శాతానికి తగ్గించారు? దళిత మహిళకు ప్రయోజనం చేకూర్చే కేంద్ర పథకాల నిధులను 20 శాతానికి ఎందుకు కోత పెట్టారు? 10 ఏళ్లుగా దేశ వ్యాప్తంగా దళిత గిరిజన మహిళలపై అత్యాచారాలు 15 నుంచి 32 శాతానికి ఎలా పెరిగాయి? వీటికి బీజేపీ నేతలు సమాధానం చెప్పాలి. బీజేపీని హెచ్చరిస్తున్నం... మర్యాదగా రాహుల్ గాంధీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం.



# ఇది లవ్ జిహాద్ కేసు!

- **షేక్ జానీ బాషా (జానీ మాస్టర్)ను తక్షణం అరెస్టు చేయాలి**
- **బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి**

**హైదరాబాద్, మహానాడు:** టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ యువతి (అసిస్టెంట్ కొరియోగ్రాఫర్)పై డ్యాన్స్ కొరియోగ్రాఫర్ షేక్ జానీ బాషా (జానీ మాస్టర్ ) లైంగిక వేధింపుల ఘటనను తీవ్రమైన చర్యగా భావిస్తున్నాం. ఓ యువతిని ఐదేళ్ల పాటు నరకం చూపించడంతో పాటు, వేధింపులు, దాడులకు పాల్పడటం, మతం మారాలంటూ ఒత్తిళ్లకు గురిచేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇది లవ్ జిహాద్ కేసు. హిందూ అమ్మాయిని ట్రాప్ చేసినట్టు స్పష్టంగా ఎఫ్ఐఆర్ లో నమోదు చేసినప్పటికీ కేసును నీరుగార్చేందుకు నిందితుడిపై పనికిరాని కేసులు పెట్టడం ఏంటి..? అని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గం. ఈ ఘటనకు కొందరు సినీ ఇండస్ట్రీ పెద్దలతో పాటు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

రాష్ట్రంలో ఇప్పటికే మహిళలపై అత్యాచారాలు, హిందూ మహిళలను మతం మార్చి లైంగికంగా వేధించే ఘటనలు తీవ్రమైనా.. రాష్ట్ర ప్రభుత్వం చీమ కుట్టినట్టు కూడా వ్యవహరించకపోవడం సిగ్గుచేటు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. దీనికి హెూంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి. రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు, అఘాయిత్యాలు జరుగుతున్నా హెూం శాఖపై ఒక్కసారి కూడా సమీక్షించలేకపోవడంతో శాంతిభద్రతల పరిస్థితి మరింత దిగజారిందని ఆమె విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఘటనలను తేలికగా తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై వేధింపులకు, లవ్ జిహాదీ చర్యలకు పాల్పడిన షేక్ జానీపై గతంలోనూ నేరచరిత్ర ఉందని, 2015లో ఓ కాలేజీలో మహిళపై దాడి కేసులో 2019లో మేడ్చల్ కోర్టు ఆరునెలల పాటు జైలుశిక్ష విధించినట్టు స్వయంగా పోలీసులే వెల్లడించారు.

తాజాగా మరోసారి మహిళా డ్యాన్సర్‌పై, మైనర్‌గా ఉన్నప్పటి నుంచీ వేధింపులకు పాల్పడినట్టు ఫిర్యాదు చేసినప్పటికీ ఈ కేసును చులకనగా తీసుకోవడాన్ని బీజేపీ మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాగం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఈ కేసును విచారణను జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును తీవ్రంగా పరిగణించి, చట్టపరంగా పారదర్శకంగా విచారణను జరిపించేలా చర్యలు తీసుకోవాలి, లేని పక్షంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని శిల్పా రెడ్డి హెచ్చరించారు.



భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ కి ప్రముఖ హైకోర్టు సీనియర్ న్యాయవాది వినుకొండ కి చెందిన ముత్తినేని కోటేశ్వరరావు సునీత దంపతులు సీఎం రిలీఫ్ ఫండ్ కి తమ వంతు రూ. 2,35,000 చెక్ ను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన హైకోర్టు ప్రముఖ సీనియర్ న్యాయవాది ముత్తినేని కోటేశ్వరరావు సునీత దంపతులను అభినందనీయులన్నారు.



వరదలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మేము సైతం అంటూ.. ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి గుంటూరుకు చెందిన దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.6,01,116 అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన వారికి మంత్రి నారా లోకేష్ కృతిజ్ఞతలు తెలిపారు.

# క్రికెట్ అసోసియేషన్‌పై చామల ఫైర్!

- **అండర్ 19 ఎంపికలో అవకతవకలు**
- **హెచ్ సి ఏ ప్రక్షాళన అవసరం**
- **భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, మహానాడు:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పై భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. హెచ్ సిఏ అండర్ 19 ఎంపికల్లో అవకతవకలు జరిగాయంటూ మండిపడ్డ ఆయన హెచ్ సి ఏ కమిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కమిటీ వైఖరి వల్ల నష్టపోయిన క్రీడాకారుల బంధువులు విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకువెళ్ళడంతో బాధితులకు మద్దతుగా ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలోకి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఏమన్నారంటే...




హెచ్ సి ఎ అండర్19 క్రికెట్‌లో అసలైన క్రీడాకారులకు ప్రాధాన్యత లేకుండా సెలెక్షన్స్ జరిగాయి. బాధితులు తమ దృష్టికి తీసుకొచ్చారు... మంచి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అనైతిక కారణాలను చూపి సెలక్షన్స్ నుండి తొలిగించారు... ఈ రోజు హెచ్ సి ఎ కార్యదర్శి దేవ్ రాజ్ ని కలిశాం... కానీ హెచ్ సిఎ లో కీలక పాత్ర వ్యవహరించాల్సిన కార్యదర్శికి బదులుగా అధ్యక్షుడు వ్యవహరిస్తున్నారు.. గత రెండేళ్ళ నుంచి జరిగే టోర్నీలోని క్రీడాకారుల డేటా, వారి ప్రతిభ అడిగాం.. హెచ్ సిఎ ని ప్రక్షాళన చేయాని, ఇక్కడ జరుగుతున్న విషయాలపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారుల ఎంపికలో అవకతవకలకు పాల్పడుతున్నారు. క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా జరగట్లేదు.. హెచ్ సి ఏ కమిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.



# సిఎంఓ కేంద్రంగా కుట్ర

- **పి. ఎస్.ఆర్ ను అరెస్టు చేసి పోలీస్ కస్టడీలోకి తీసుకోవాలి**
- **సీఎంఓలో జగన్ పాత్ర కూడా వెలుగులోకి వస్తుంది**
- **డిసిపి రమణమూర్తి పాత్ర కూడా ఉన్నట్లు తేలింది**
- **ఐపీఎస్ అధికారుల తీరుపై టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఫైర్**

**విజయవాడ,మహానాడు:** ముగ్గురు ఐపియస్ అధికారులు ముంబై నటిని చిత్ర హింసలు పెట్టారు. విశాల్ గున్నీ స్టేట్ మెంట్ ను బట్టి సిఎంఓ కేంద్రంగా కుట్ర జరిగింది. జగన్ ఆదేశాలను పి. ఎస్.ఆర్ ఆంజనేయులు అమలు చేశారు. అతని ద్వారా రాణా, విశాల్ గున్నీ దుర్మార్గంగా వ్యవహరించారు. గతంలోకూడా పియస్.ఆర్ ఆంజనేయులు అనేక మందిని ఇబ్బందులు పెట్టాడు.

డిసిపి రమణమూర్తి పాత్ర కూడా ఉన్నట్లు తేలింది గున్నీ రిపోర్ట్ ఆధారంగా ఆంజనేయులును అరెస్టు చేసి పోలీస్ కస్టడీలోకి తీసుకోవాలి. అతన్ని విచారిస్తే అనేక వాస్తవాలు బయటకి వస్తాయి. సీఎంఓలో జగన్ పాత్ర కూడా వెలుగులోకి వస్తుంది. ఒక ఆడపిల్లను ముగ్గురు ఐపియస్‌లు హింసించారని తేలింది.

తప్పు చేసిన వారు ఎవరైనా కఠినంగా శిక్షించాలి. పోలీసు అధికారుల సంఘం కూడా స్పందించాలి. ఆనాడు జగన్ చెప్పినట్లు మాట్లాడిన అధికారులు, మీ పోలీసులు నిర్వాకం పై మాట్లాడరా? గత ప్రభుత్వం లో చంద్రబాబు, నారా లోకెష్ లను అనేక సార్లు అడ్డుకున్నారు. కక్ష పూరితంగా చేసిన ఆనాటి అధికారులు పాత్ర పై విచారణ చేయించాలి.

వీళ్లను వదిలేస్తే ఇలానే మళ్లీ చేస్తారు.. అలా జరగకూడదు. కక్షపూరిత రాజకీయాలు వద్దని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు మాకు చెప్పారు. మీ మీద ఉన్న గౌరవంతో మేము సైలెంట్‌గా ఉన్నాం.కానీ ఆ ఘటనలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.పి. ఎస్.ఆర్ ఆంజనేయులును అరెస్టు చేసి విచారణ చేస్తే అందరూ బయటకి వస్తారు. ప్రభుత్వం ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

## మోదీ వంద రోజుల పాలనలో
# సాహసోపేత నిర్ణయాలు

- **బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్**

**హైదరాబాద్,మహానాడు:** ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వేలు, భద్రత, ఇంధనం, సాంకేతికత వంటి అనేక రంగాలలో ఈ ప్రాజెక్టులకు నరేంద్ర మోదీ ప్రభుత్వం గత వంద రోజుల పాలనలో, సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వివరించారు.



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రగతి నివేదన రూపంలో ప్రజల ముందుంచారు. అయితే, దేశంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలనను మెచ్చి ప్రజలు పట్టం కడుతుంటే, కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీ, నెహ్రూ కుటుంబం జీర్ణించుకోలేక, అబద్ధపు ప్రచారంతో దాడి చేస్తున్నారంటూ లక్ష్మణ్ మండిపడ్డారు.

రాహుల్ గాంధీ భారత ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించకుండా, విదేశాలకు వెళ్లి అక్కడ దేశంపై విషం చిమ్ముతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ గారిపై నిందలు వేయడం రాహుల్ గాంధీకి పరిపాటిగా మారిందంటూ దుయ్యబట్టారు.

ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డితో పాటు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా వాటిని నెరవేర్చేలా నరేంద్ర మోదీ పాలన అందిస్తుంటే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మాత్రం ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తూ కాలం వెల్లదీస్తోందంటూ విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, తెలంగాణలో గ్యారంటీల పేరుతో మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను హామీలు అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని లక్ష్మణ్ మండిపడ్డారు.

ఈ సందర్భంగా మోదీ 3.0 పాలనలో 100 రోజుల్లో జరిగిన అభి వృద్ధిని, తీసుకున్న నిర్ణయాలను, సంక్షేమ కార్యక్రమా లపై ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందుంచారు.

# నాచారమా... నరకమా?

- **రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం**
- **వారంలో రెండు నుంచి మూడు యాక్సిడెంట్లు**
- **కారణలు ఏంటి? ఎవరిదీ నిర్లక్ష్యం?**

**హైదరాబాద్, మహానాడు:** నాచారాం... ప్రజలకు నరకం చూపిస్తోంది. వారంలో రెండు నుంచి మూడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అయినా... కారణాలు తెలియడం లేదు... ప్రభుత్వానిదా నిర్లక్ష్యం? ట్రాఫిక్ పోలీసుల అలసత్వమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తాజా ఓ మాతృమూర్తి ఈ లోకాన్ని వీడింది. కుమార్తెను స్కూల్ దగ్గర వదిలిన ఆ తల్లి.. తిరిగి వచ్చే క్రమంలో హెవీ వెహికల్ చక్రాల కింద పడి దుర్మరణం పాలైంది. ఈ ఘటన నాచారం పోలీస్ స్టేషన్ లిమిట్స్ హెచ్‌ఎంటి గేటు వద్ద చోటుచేసుకుంది. దీంతో ఆ ప్రాంతంగా విషాదంలో మునిగిపోయింది. నాచారం మెయిన్ రోడ్డు హెచ్‌ఎంటి నగర్ కమాన్ వద్ద గ్యాస్ సిలిండర్ హెవి వెహికల్ ఈమె వాహనాన్ని ఢీకొంది. ఆమెకు ఐదేళ్ళ కొడుకూ ఉన్నాడు. పాఠశాలకు వెళ్ళిన ఆ




పాపకి తిరిగి ఇంటికి వచ్చేంతవరకు తన తల్లి చనిపోయి వార్త తెలియదని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
11
డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||




# 100 రోజుల పాలన....
# 1000 అడుగులు ముందుకు..!

**అమరావతి, మహానాడు:** 'కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావొస్తోంది... ఈ వంద రోజుల్లో పాలనాపరంగా 1000 అడుగులు ముందుకు వేశాం. ఈనెల 20వ తేదీ నుండి 26 వరకు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే వాటిని ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలి. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తే పాలన ఎలా ఉంటుందో ఈ 100 రోజులు ఒక ఉదాహరణ.

ప్రజాప్రతినిధులంతా నెలకు పది రోజుల పాటు ప్రజల్లో ఉండాలి' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరితో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' అనే పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం కూటమి ప్రజాప్రతినిధులను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు.

## వైసీపీ హయాంలో రాష్ట్రంలో భయంకర పరిస్థితులు

వైసీపీ పాలనలో రాష్ట్రంలో భయంకర పరిస్థితులు నెలకొన్నాయి. నన్ను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారు. పరామర్శకు పవన్ కళ్యాణ్ రాకుండా బుక్ చేసుకున్న విమానాన్ని రద్దు చేశారు. రోడ్డు మార్గాన వస్తుంటే నందిగామలో అడ్డుకోవడంతో రోడ్డుపై పడుకుని ధర్నా చేశారు. సాధారణంగా షూటింగ్ లో చేయాల్సినవి... నిజ జీవితంలో కూడా చేసి పోరాట యోధునిగా పవన్ కళ్యాణ్ నిలిచారు. రాజకీయాల్లోకి పవన్ ఒక ఆశయంతో వచ్చారు. 2014లో టీడీపీ, బీజేపీ పొత్తుపెట్టుకున్న సమయంలో ఓట్లు చీలకుండా ఉండేందుకు పోటీ చేయకుండా అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. రాజమండ్రి జైల్లో నన్ను కలిసి వచ్చిన అనంతరం రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు.

## విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకోవాలి

విజన్ 2047...కేంద్రం వికసిత్ భారత్‌కు నాంది పలికింది... మనం స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌తో 2047కి విజన్ సిద్ధం చేస్తున్నాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకోవాలి. మనకు ఓట్లు వేసిన ప్రజలను అన్ని విధాలా పైకి తీసుకురావడానికి కష్టపడి పనిచేద్దాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. 2047 నాటికి రాష్ట్రంలో పేదరికం, ఆర్థిక అసమానతలు తగ్గుదలకు ప్రణాళిక రూపొందించుకుందాం. గత పాలకులు విచ్చలవిడిగా రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారు. లక్ష కోట్ల బిల్లులు పెండింగులో పెట్టారు. ఇలాంటి కష్టసమయంలో అధికారంలోకి వచ్చాం. అయినా ఎమ్మెల్యేలు, ఎంపీలు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర సహకారంతో ముందుకు అడుగేస్తు న్నామని చంద్రబాబు అన్నారు.

ప్రజలు గెలవాలి...రాష్ట్రాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించుకున్నాం. సీట్లు సర్దుబాటుతో పాటు ఇతర అంశాల్లో కూడా ఎక్కడా చిన్న సమస్య రాకుండా చూసుకున్నాం. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఆలోచించాం. మోదీ 3వ సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకుంది. కేంద్రంలో మనం అనుకున్న ప్రభుత్వం రాకుండా ఉంటే వెంటిలైటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కష్టంగా ఉండేది అని చంద్రబాబు అన్నారు.

## ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత నీరు

నరేంద్ర మోదీ 3వ సారి పీఎం అయ్యి దృఢమైన సంకల్పంతో వికసిత్ భారత్-2047తో ముందుకు వెళు తున్నారు. వరల్డ్ క్లాస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఉద్యోగాలు, ఇతర మార్పులు తీసుకొస్తున్నారు. వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ కింద వైద్యం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి రాబోయే 3 ఏళ్లలో రూ.58 వేల కోట్లు ఖర్చు చేసేందుకు కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది.

మీ నియోజకవర్గాల పరిధిలో జాతీయ రహదారులను ఫాస్ట్ ట్రాక్‌లో పెట్టుకునేలా మీరు కృషి చేయాలి. జల్ జీవన్ మిషన్ పథకానికి కేంద్రం 50 శాతం నిధులు ఇస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చే డబ్బులు సరిగా ఖర్చు చేయకుండా పథకాన్ని రాష్ట్రంలో నిర్వీర్యం చేసింది. దీనిపై మళ్లీ కేంద్రాన్ని ఒప్పించి జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత నీళ్ళు అందిస్తామని హామీ ఇచ్చారు.

## పంచాయతీల్లో గ్రామసభలు ఒక రికార్డ్

స్థానిక సంస్థలకు గతంలో రూ.990 కోట్ల నిధులను ఆర్థిక సంఘం ఇవ్వలేదు... వాటిని కూడా ప్రభుత్వం వచ్చాక మంజూరు చేసింది. మరో రూ.1100 కోట్లు కేంద్రం నుండి మ్యాచింగ్ గ్రాంట్ గా వచ్చాయి. మరో రూ.2 వేల కోట్లను కేంద్రం అందిస్తుంది. ఉపాధి హామీ పనిదినాలను ఆమోదించేందుకు రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు పెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ ఆలోచన రావడం అద్భుతం. రూ.4,500 కోట్ల పనులకు గ్రామ సభల ద్వారా ఆమోదం కూడా తెలపడం ఒక చరిత్ర.

ఇటువంటి కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా లేదు... అందుకే వరల్డ్ రికార్డు లభించింది. గ్రామాల్లో రోడ్ల కనెక్టివిటీ కోసం కేంద్రం రూ.49 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. రైల్వే లైన్లకు కూడా కేంద్రం నిధులు కేటాయిస్తోంది. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు గత ప్రభుత్వం స్థలం ఇవ్వలేదు. దీంతో జోన్ కార్యాలయం ఏర్పాటు కాలేదు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే అవసరమైన భూమి ఇచ్చింది. త్వరలోనే రైల్వే జోన్ కు శంకుస్థాపన చేస్తామని కేంద్రం తెలిపింది. భారత ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ మీద ఫోకస్ పెట్టిందని సీఎం వివరించారు.

## గ్రీన్ ఎనర్జీలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు... 7.5 లక్షల ఉద్యోగాలు లక్ష్యం

పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకుని 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి సబ్సిడీ ఇస్తోంది. దీనికి కొంత మొత్తంలో లబ్ధిదారులను వాటాను కలుపుకొని ఏర్పాటు చేసుకుంటే రాబోయే రోజుల్లో శాశ్వతంగా విద్యుత్ బిల్లులు కట్టే పరిస్థితి ఉండదు. దీన్ని ఒక ఉద్యమంలా మనం ముందుకు తీసుకెళ్లాలి.

గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌లో పెను మార్పులు వస్తాయి. ఒకప్పుడు పొలాలకు సరిగా కరెంట్ లేని పరిస్థితి. కానీ ఇప్పుడు కుసుమ్ పథకం కింద పంపు సెట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకునే పరిస్థితి ఉంది. రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో గ్రీన్ ఎనర్జీ ద్వారా 72 గిగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో పాటు, రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ముందుకెళ్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

## చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి

సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాడు 5 ప్రధాన హామీల అమలుపై సంతకం చేశాను. 16,347 ఉద్యోగాలతో డీఎస్సీకి నిర్వహణకు శ్రీకారం చుట్టాం. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే దిశగా ముందుకు వెళ్తాం. వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో వెయ్యి మాత్రమే పెంచింది. కానీ మనం ఒకేసారి వెయ్యి పెంచి ఏప్రిల్, మే, జూన్ నెల బకాయిలు కూడా ఇచ్చాం. వాలంటీర్లు లేకుండా పింఛన్లు ఇవ్వలేరని ప్రచారం చేశారు. సచివాలయాల చుట్టూ వృద్ధులను తిప్పి 35 మంది ప్రాణాలు తీశారు. కూటమి ప్రభుత్వం రాగానే వాలంటీర్లు లేకుండా ప్రభుత్వ యంత్రాంగంతో ఒకే రోజున పింఛన్లు



పంపిణీ చేశాం. ప్రతి నెలా 1వ తేదీన పేదల సేవలో కార్యక్రమం ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. ఉద్యోగులు గత ఐదేళ్లలో ఏనాడూ మొదటి తేదీన జీతం తీసుకోలేదు.

కానీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు, పెన్షన్ దారులకు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నాం. మనం చేస్తున్న మంచిని ప్రజలకు చెప్పాలి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కూడా రద్దు చేశాం...ఇదొక భయంకరమైన చట్టం. సొంత మనుషుల్ని పెట్టుకుని రికార్డులు రాయడానికి గత పాలకులు చట్టం తెచ్చుకున్నారు. కోర్టుకు కూడా వెళ్లే అవకాశం లేకుండా చట్టం చేశారు. అందుకే అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులను కాపాడాం. రికార్డులను గత ప్రభుత్వం తారుమారు చేసి కొన్ని లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ చేసి దోచుకున్నారు.

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాలు తగలబెట్టారు. తప్పులు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల పొట్టగొట్టారు. అందుకే నాలుగవ సంతకంలో భాగంగా 100 క్యాంటీన్లు ఏర్పాటు చేశాం...వాటిని త్వరలోనే 203కు పెంచుతాం. నైపుణ్య గణన చేస్తే బావుంటందని పవన్ కళ్యాణ్ ఇచ్చిన సూచనలతో దేశంలోనే మొదటి సారిగా నైపుణ్య గణన చేపట్టబోతున్నామని ప్రకటించారు.

## ప్రతి ఒక్కరికీ ఇల్లు

ళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం. పెండింగులో ఉన్న ఇళ్ళు పూర్తి చేస్తాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తాం. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం ఇస్తాం. పట్టాదారు పాసుపుస్తకాలను రాజముద్రతో రైతులకు అప్పగిస్తాం. ఏ వ్యక్తి ఫోటోలు ఎక్కడా ఉండవు. 2047 విజన్ తో 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా పెట్టుకున్నాం. అసాధ్యం అంటున్నారు... సుసాధ్యం చేసి చూపిస్తాం. నూతన ఎంఎస్ఎంఈ విధానం, నూతన ఇండస్ట్రియల్ పాలసీల త్వరలో తీసుకొస్తాం. రాబోయే రోజుల్లో పోర్టులు, ఎయిర్ పోర్టులు చాలా ముఖ్యం అవుతాయి. అన్ని ట్రస్ట్ బోర్డుల్లో బ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణులను నియమిస్తున్నామని చంద్రబాబు అన్నారు.

## విర్రవీగిన వాళ్లను ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు

ఐదేళ్ల విధ్వంసాన్ని ప్రజల ముందు పెట్టేందుకు 7 శ్వేత పత్రాలు విడుదల చేసి ప్రజలకు పరిస్థితులను వివరించాం. వాలంటీర్ల పదవీ కాలం యేడాది ముందే అయిపోయింది. వాలంటీర్ల గురించి మాట్లాడే వ్యక్తి వాళ్లను రెన్యువల్ ఎందుకు చేయలేదు.? కొంతమందితో







రాజీనామాలు చేయించారు...మిగతా వాళ్లవి కాల పరిమితి అయిపోయింది. 4 లక్షల మందితో నెలకు రూ.200 చొప్పున సాక్షి పత్రక కొనుగోల చేయించారు.

ప్రజాస్వామ్య దేశంలో ఇది ఎక్కడా జరగలేదు. ఆ పేపర్లో వేసే అసత్యాలు, అబద్ధాలను వాలంటీర్ల ద్వారా ఇంటింటికి ప్రచారం చేశారు. తప్పుడు ప్రచారం ఎంత చేసినా, ఏదో ఒక విధంగా మభ్యపెట్టాలని చూసినా ప్రజలకు వాస్తవాలు తెలిస్తాయి. 151 సీట్లు వచ్చాయని విర్రవీగిని వారికి 11 సీట్లు వచ్చేలా చేశారంటే అదే ప్రజాస్వామ్య రహస్యం. ఉచిత ఇసుకను కూడా అమలు చేస్తున్నాం. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక అక్రమాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి...వాటిపై ఇప్పుడు విచారణ చేస్తున్నాం. గతంలో వారు చేసిన తప్పులు మనం చేయకూడదు. అందరినీ కోరుతున్నాం....మీ నియోజక వర్గాల్లో నాయకులు జోక్యం చేసుకోకుండా ప్రజలకు ఇసుకను చేర్చగలిగితే మన గెలుపునకు దోహదం చేస్తుంది.

## రెండేళ్లలో పోలవరం ఫేజ్ -1 పూర్తి చేసి జాతికి అంకితం

ఒక వ్యక్తి స్వలాభం కోసం మద్యం విధానాన్ని మార్చారు. సొంత బ్రాండ్లు, సొంత డిస్టలరీలు ఏర్పాటు చేసుకున్నారు. నాణ్యత లేని మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారు. అక్టోబరులో కొత్త మద్యంపాలసీ అమల్లోకి వస్తుంది. నాసిరకం మద్యాన్ని నిర్మూలిస్తాం. కేంద్రం



పోలవరానికి రూ.12,500 కోట్ల కేంద్రం ప్రకటించింది. కొత్త డయాఫ్రం వాల్ కూడా నిర్మించాల్సి ఉంది...2 ఏళ్లలో పోలవరం ఫేజ్-1 పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పోలవరాన్ని పూర్తి చేసి రైతులకు, జాతికి అంకితం చేస్తాం.

అమరావతికి మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తాం. రాజధాని నిర్మాణానికి వరల్డ్ బ్యాంకు ద్వారా రూ.15 వేల కోట్లు అందించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు నిధులు కేటాయించింది...ఈ పార్కుల ద్వారా వేల సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయి. శ్రీసిటీలో 15 సంస్థలు ప్రారంభించి, మరో 6 సంస్థలకు శంకుస్థాపన చేశాం. బీపీసీఎల్ రూ.70వేల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చింది. విశాఖపట్నం ఎన్టీపీసీ రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సుకతతో ఉంది అని చంద్రబాబు వివరించారు.

## పోలీస్ వ్యవస్థలో ప్రక్షాళన... చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు

గతంలో గ్రామాల్లో 25 వేల కి.మీ సిమెంట్ రోడ్లు వేశాం. మ్యాచింగ్ ఇచ్చుకుంటే గ్రామాల్లో అన్ని పనులు చేసుకోవచ్చు. రాబోయే ఐదేళ్లలో 17 వేల కి.మీ సీసీ రోడ్లు, 10 వేల కి.మీ సీసీ డ్రెయిన్ ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం రైతులకు బకాయిలు పెట్టిన రూ.1,670 కోట్లు చెల్లించాం. రాబోయే రోజుల్లో కూడా 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లిస్తాం. రైతులకు డ్రిప్ 90 శాతం సబ్సిడీతో అందిస్తాం. రూ.340 కోట్లతో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు చేస్తాం. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే నాటి సీఎం కనీసం అక్కడికి వెళ్లలేదు. పులిచింతల గేట్ కొట్టుకుపోతే రెండు సీజన్ల పాటు గేటు ఏర్పాటు చేయలేదు.

గుండ్లకమ్మ గేటు కొట్టకుపోయింది. తుంగభద్ర గేటు కొట్టకుపోయింది. సాగుకు నీళ్లు ఇవ్వలేమని అధికారులు ప్రకటించారు..కానీ గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడుని పంపి గేటు ఏర్పాటు చేసి నీటి వృధాను అడ్డుకున్నాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సమస్యగా చేయడానికి చూస్తున్నారు. గతంలో వాజ్ పేయ్ హయాంలో నిధులు కేటాయించి నష్టాల నుండి గట్టెక్కించాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ కాకుండా చూస్తున్నాం. నీరు చెట్టు, నరేగా బిల్లులు కూడా విడుదల చేస్తున్నాం. పోలీసు వ్యవస్థను కూడా ప్రక్షాళన చేసి జవాబుదారీ తనం తీసుకొస్తున్నాం. గత ఐదేళ్లు ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు.

ముంబయిలో ఉన్న హీరోయిన్‌ను అరెస్టు చేసి ఇబ్బందులు పెట్టారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. దేవాలయాల్లో పని చేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలకు గౌరవ వేతనం పెంచాం. బీసీలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కూడా కేబినెట్‌లో ఆమోదించాం. అసెంబ్లీలో పాస్ చేసి కేంద్రానికి పంపుతాం. అర్చకుల వేతం రూ.10 వేల నుండి 15 వేలకు పెంచామని సీఎం చంద్రబాబు వివరించారు.

## వైసీపీ హయాంలో తిరుమల ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడకం

తిరుమల లడ్డూను కూడా గత ఐదేళ్లు నాసిరకంగా చేశారు. వెంకటేశ్వరస్వామి పవిత్రతను దెబ్బతీశారు. దేవుడు ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వును వాడారు. వెంకటేశ్వరస్వామి ప్రతిష్టతను పెంచి పవిత్రతను కాపాడుతాం. రాష్ట్రంలో రోడ్లు దారుణంగా ఉన్నాయి. ముందుగా గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రూ.500 కోట్లు మంజూరు చేశాం. పెద్ద ఎత్తున వరదలు సంభవించాయి. నా జీవితంలో చాలా సార్లు చూశాను కానీ...ఇంత పెద్ద ఎత్తున సీఎంఆర్ఎఫ్ కు దాతలు ఏనాడూ విరాళాలు ఇవ్వలేదు.

కూటమి ఎమ్మెల్యేల తరపున కూడా ఒక నెల జీతం విరాళంగా ఇద్దాం. బుడమేరు ప్రాంతంలో కబ్జాలు పెరగడం వల్లే వరద ముంపునకు కారణం. బుడమేరు మరమ్మతులకు నిధులు కేటాయిస్తే గత ప్రభుత్వం వాటిని రద్దు చేశారు. ప్రకృతి విలయం, గత పాలకుల తప్పిదాలు ప్రజలకు శాపంగా మారి 10 రోజులు నీళ్లలోనే ఉన్నారు. 10 రోజుల పాటు విజయవాడ కలెక్టరేట్ లో ఉండి పరిస్థితులు సాధారణ స్థితికి తీసుకొచ్చాం. అందుకే ప్రతి ఇంటికి రూ.25 వేలు అందించాలని నిర్ణయించాం.

25 కేజీల బియ్యం, 5 రకాల నిత్యవసర సరుకులు అందించాం.బుడమేరు గండ్లను పూడ్చేందుకు మంత్రులు నిమ్మల రామానాయుడు, లోకేష్ రేయింబవళ్ళు కష్ట పడ్డారు. పాడైపోయిన ద్విచక్ర వాహనాల రిపేర్లకు రూ.3 వేలు ప్రకటించాం. టర్నోవర్ ను బట్టి ఎంఎస్ఎంఈలకు ప్యాకేజీని ప్రకటించాం. ఇంత పెద్ద మొత్తంలో వరద బాధితులకు ప్యాకేజీ ఎవరూ, ఎప్పుడూ ప్రకటించలేదు. పంటలకు కూడా మొదటి సారి హెక్టారకు రూ.25 వేలు పరిహారం ప్రకటించాం. నష్టపోయిన కౌలు రైతులకే నేరుగా పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

### 3 పార్టీల ఆలోచనలు భిన్నంగా ఉన్నా..
## ధ్యేయం రాష్ట్రాభివృద్ధే...

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎన్నో అవకతవకలకు పాల్పడింది. ఖర్చు పెట్టిన డబ్బుకు లెక్కలు చూపలేదు. కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించారు. ఉద్యోగు లకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ వస్తున్నాం. మనల్ని ప్రజలు గెలిపించారు...చాలా ఆశలు పెట్టుకు న్నారు. 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లు సాధించడం నా రాజకీయ జీవిత చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. 1994లో కూడా ఇంత మెజారిటీ రాలేదు. మూడు పార్టీలు అనుసరించిన విధానమే ఈ ఘన విజయానికి కారణం.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ వారు మెచ్చుకునేలా మన నడవడిక ఉండాలి. మూడు పార్టీలలో విభిన్న ఆలో చనలు ఉన్నా రాష్ట్రాభివృద్ధే మన ధ్యేయం. ఈ కలయిక శాశ్వతంగా ఉండాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. 100 రోజుల పాలనలో మన ప్రభుత్వం ఏం చేసింది... ఏం చేయబోతోందో కూడా ప్రజలకు వివరించాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కలిగించాలని చంద్రబాబు అన్నారు.

## దీపావళి పండుగ కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభం

సూపర్ 6 హామీల్లో భాగంగా ఇచ్చిన 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి పండుగ రోజున మొదటి గ్యాస్ అందిస్తాం. రోజున ఉచిత గ్యాస్ సిలిండర్ మొదటి గ్యాస్ అందిస్తాం. మిగిలిన అన్ని సంక్షేమ కార్యక్రమాలు క్రమేనా అమలు చేస్తాం. మనందరిపై పవిత్రమై బాధ్యత ఉంది. ప్రతి అడుగూ ప్రజల కోసం వేయాలి. అనునిత్యం పేదల కోసం పని చేయాలి. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దు. ఈ వంద రోజులపాటు మీరు చూపించిన సమన్వయం అమోఘం. దీన్ని మరింత దృఢత్వంతో ముందుకు తీసుకెళ్లాలి. వైసీపీ అనునిత్యం విషం కక్కే పనిలో ఉంది...ఏమాత్రం అశ్రద్ధ వహించకుండా తిప్పికొట్టాలి. వ్యక్తిగత విమర్శలు కాకుండా ప్రజలకు వాస్తవాలను వివరించాలి.

సొంత బాబాయిని చంపి గుండెపోటు అని మొదట చెప్పి సాయంత్రానికి నారాసుర రక్త చరిత్ర అని దొంగ పత్రికలో రాసుకున్నారు. క్రూరంగా చంపిన విషయాన్ని దాచి ప్రజలను మభ్య పెట్టారు. ఇలాంటి వారి వల్ల కలిగే నష్టాలేంటో ప్రజలకు వివరించాలి. త్వరలోనే నామినేటెడ్ పోస్టులు కూడా భర్తీ చేస్తాం. గుజరాత్ లో స్థిరప్రభుత్వం కొనసాగడం వల్ల అభివృద్ధి చెందింది. 175కు 175 సీట్లు మనమే గెలుస్తాం...40 ఏళ్లు మనమే అధికారంలో ఉంటామని చెప్పం. స్థిరమైన ప్రభుత్వం వల్ల అభివృద్ధి చేసుకోగలుగుతాం.

త్వరలోనే జిల్లాలకు ఇంఛార్జ్ మంత్రులను నియమిస్తాం. జిల్లాల వారీగా మూడు పార్టీల అధ్యక్షులు సమన్వయంతో పని చేయాలి. తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి,కృష్ణా-గుంటూరు జిల్లాల గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా రాబోతున్నాయి...త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తాం. ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలు చేరవేయాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.



జనం గుండె చప్పుడు

# మహానాడు

12

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||గురువారం 19, సెప్టెంబర్ 2024||

## పేదవారి కోసం అన్నా క్యాంటీన్లు

● స్పీకర్ అయ్యన్న పాత్రుడు

నర్సీపట్నం, మహానాడు: చంద్రబాబు ప్రభుత్వం హయాంలోనే అన్న క్యాంటిన్లు ఏర్పాటు అయ్యాయని, అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ క్యాంటిన్లను నిలిపివేసిందని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న ప్రాత్రుడు అన్నారు. నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ను స్పీకర్, కలెక్టర్ విజయ్ కృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. ఈ అన్న క్యాంటిన్ నిర్వహణ బాధ్యతలు హరేరామ హరికృష్ణ సంస్థ చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లు నిలిపివేయడంతో సొంత నిధులతోనే అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో చింతకాయల పద్మవతి, రెండు రూపాయలకే అన్న క్యాంటిన్ నిర్వహించారన్నారు. ప్రతి నియోజకవర్గంలో పేదవారి కోసం అన్న క్యాంటిన్లు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ క్యాంటిన్లు పేదవారి కోసం ప్రత్యేకంగా నిర్వహించ బడుతున్నాయని, ప్రతి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని అన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, సతీమణి పద్మావతి, కోడలు దివ్యరాజేష్, కలెక్టర్లతో కలిసి అన్నా క్యాంటీన్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న భార్య చింతకాయల పద్మవతి, మున్సిపల్ ఛైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, జెడ్పీటీసి రమణమ్మ ఆర్డీవో జయరామ్, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.







## వరద బాధితులకు విరాళాలు







మంగళగిరి, మహానాడు: ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం అనంతరం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసి పలువురు నాయకులు, ప్రముఖులు విరాళాలు అందజేశారు. కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నేతృత్వంలో నాయకులు, వివిధ సంస్థల నిర్వాహకులు కలిసి రూ.8,11,063 విరాళం అందజేశారు. అలాగే, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ నేతృత్వంలో నాయకులు, స్వచ్ఛందంగా ప్రజలు, వివధ సంస్థల నిర్వాహకులు కలిసి రూ.6,38,435, సుధా సోమెనీ సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు రూ.5 లక్షలు, మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి నేతృత్వంలో కొండపి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కలిసి రూ.2 లక్షలు, శ్రీకాళహస్తి శ్రీసిటీకి చెందిన శ్రీనివాస కన్ స్ట్రక్షన్స్ యాజమాన్యం రూ.లక్ష, తిరుపతి జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ మెడికల్ ప్రాక్టిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.51,116 అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు అందజేసిన దాతలకు మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.




## ఆపన్నులకు శ్రీ భ్రమర ట్రస్ట్ ఆపన్న హస్తం

● ఎంబిబిఎస్ చదువు కోసం విద్యార్థినికి ఆర్థిక భరోసా కల్పించిన రామచంద్రరావు

విజయవాడ, మహానాడు: ఒడిశా రాష్ట్రం నుండి ఎన్నో ఏళ్ల క్రిందట గుంటూరు నగరానికి వచ్చి స్థిరపడిన కృష్ణానంద్ సింగ్ కుమార్తె శృతి సింగ్ అనే పేద విద్యార్థిని ఎంబిబిఎస్ చదువు నిమిత్తం ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్నదని ఓ పత్రిక కథనం ద్వారా తెలుసుకున్న శ్రీ భ్రమర టౌన్షిప్ అధినేత రామచంద్రరావు వెంటనే స్పందించారు. బుధవారం ఇన్నర్ రింగ్ రోడ్డు లోని తమ కార్యాలయంలో రామచంద్ర రావు, మాధవి దంపతులు విద్యార్థినితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని భవిష్యత్తుకి భరోసాన్ని కల్పించారు.

ఈ సందర్భంగా గళ్ళా రామచంద్రరావు ఏమన్నారంటే... చదువుకోవడం అనేది ప్రతి ఒక్కరికి అవసరం. ఈ క్రమంలో మంచి ప్రతిభ ఉన్నా కూడా సరైన ఆర్థిక స్థోమత లేకపోవడం వలన అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. ఇదే క్రమంలో గుంటూరు నగరానికి చెందిన శృతి సింగ్ అనే విద్యార్థిని తండ్రి లేకపోవడం వలన, తల్లి కష్టం మీద చదువుకున్నారు.

శృతి సింగ్ డాక్టర్ చదవాలని గొప్ప కల అది నెరవేరాలంటే ఖచ్చితంగా ఆర్థిక సహకార అవసరం ఉంది అని తెలుసుకుని ఈరోజు శ్రీ భ్రమర ట్రస్టు ద్వారా ఆ విద్యార్థినికి ఆర్థికంగా అండగా నిలబడాలని నిశ్చయించుకున్నాను. మంచి ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు సాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. కాబట్టి శృతి సింగ్ 5ఏళ్ల ఎంబిబిఎస్ చదువుకు అయ్యే కాలేజీ ఫీజులు మొత్తం కూడా శ్రీ భ్రమర ట్రస్ట్ ద్వారా చెల్లిస్తామని హామీ ఇస్తున్నాం అని గళ్ళా రామ చంద్ర రావు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థి మంచి డాక్టర్ గా ఎదిగి, పేదరికంలో ఉన్న విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని గళ్ళా రామచంద్రరావు తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మాట్లాడుతూ శ్రీ భ్రమరా ట్రస్ట్ ద్వారా అనేకమంది ఆపన్నులకు ఆపన్న హస్తం అందిస్తూ నేడు ఎంతో ఉన్నతమైన విద్యను పేదలకి చేరువ చేయడంలో ఎంతో కృషి చేసిన శ్రీ భ్రమరా ట్రస్ట్ సభ్యులను అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## బాధితులకు వైఎస్ జగన్ ఆర్థిక సాయం

● లీగల్ టీమ్ ఏర్పాటు



విజయవాడ,మహానాడు: ప్రత్యర్థుల దాడిలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు మాజీ సీఎం వైఎస్ జగన్ ఆర్థిక సాయం చేశారు.కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని కాశీవారిపాకలకు చెందిన పోలవరపు లోవలక్ష్మికి రూ.లక్ష,వాసంశెట్టి శ్రీలక్ష్మికి రూ.50 వేల సాయం అందించారు. ఇటీవల జగన్ పిఠాపురం పర్యటనకు వెళ్లగా, బాధితులు ఆయనకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో వారికి సాయం చేయడంతోపాటు లీగల్ టీమ్ కూడా ఏర్పాటు చేశారు.

# కొత్త మద్యం పాలసీకి ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 18,మహానాడు: రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకు కేబినెట్ సమావేశ మందిరంలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రెండో ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు.

గ్రామ, వార్డు వాలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నెలకు రూ.200 చొప్పున అదనపు ఆర్థిక సాయం అందించేందుకు జీవోఆర్టీ నెం.6, జీవో నంబరు 7, తేదీ.03.04.2023న జారీ చేసిన ఉత్తర్వులను, ఉపసంహరించుకోవాలని చేసి ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

రాజకీయ లబ్ధికోసం ఎవరికో ఆర్థిక లాభం చేకూరే విధంగా చేసిన ఈ ఉత్తర్వులు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.102 కోట్లు నష్టం వాటిల్లిందని, దీనిపై కమిటీ వేసి పూర్తి వివరాలను సేకరించవలసినదిగా మంత్రి మండలికి ముఖ్యమంత్రి ఆదేశించారు.

విజయనగరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం" గా పేరు మార్చడానికి ఆమోదం తెలిపే తీర్మానం మరియు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడానికి చేసిన ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

ప్రతి ఇంట ఒక ఎంఎస్ఎంఈ ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ దిశగా పారిశ్రామిక, వాణిజ్య శాఖ పనిచేయాలని ఆయన ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రెడిట్ గ్యారంటీ ఫండ్ స్కీం కింద అందే లబ్ధిని రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) లకు అందజేసి వాటిని అభివృద్ధి పథంలో నడపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్లతో ప్రాథమిక కార్పస్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తద్వారా కొలేటరల్ గ్యారెంటీ లేకుండా ఎంఎస్ఎంఈ లకు దాదాపు రూ.5 వేల కోట్ల మేర ఋణ సౌకర్యం కలుగనుంది.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) లకు కొల్లేటరల్ సెక్యూరిటీ లేకుండా రుణాలు, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పరిశ్రమలకు చేయూత అందించడానికి ఈ నిధి ఉపకరిస్తుంది.

ఈ క్రెడిట్ గ్యారంటీ ఫండ్ స్కీం ద్వారా సుమారు 35,000 కొత్త గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులు ప్రయోజనం కలుగనుంది, తద్వారా వ్యవస్థాపకత మరియు సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిసోంది.


మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (సీజీటీఎంఎస్ఈ) భాగస్వామ్యంతో ఇప్పటికే అందిస్తున్న 75-85 శాతం గ్యారంటీకి అదనంగా 10 నుంచి 20 శాతం రుణాలకు అదనపు గ్యారంటీ లభిస్తుంది. ఇది ఎంఎస్ఈలకు ఇచ్చిన రుణ మొత్తంలో 95% అంటే గరిష్టంగా రూ. 5 కోట్ల వరకు రుణం తీసుకునే ఎంఎస్ఈలకు ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా సమర్థవంతంగా కవర్ చేయడం జరుగుతుంది.

ఎంఎస్ఈ ల కోసం ఆంధ్రప్రదేశ్ క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ రాష్ట్రంలోని సూక్ష్మ మరియు చిన్న పరిశ్రమలకు సాధికారత కల్పించడానికి ఒక ముఖ్యమైన అడుగు. అవి అభివృద్ధి చెందడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. %జ+ఒమీజు%తో ఈ సహకారం అవసరమైన క్రెడిట్ గ్యారెంటీ మెకానిజమ్‌ను అందిస్తుంది, పూచీకత్తు అవసరం లేకుండానే సులభంగా రుణాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది మరియు ఆంధ్రప్రదేశ్‌లో మరింత సమగ్రమైన మరియు సహాయక వ్యాపార వాతావరణాన్ని నిర్ధారిస్తుంది.

కడప జిల్లా కొప్పర్తిలోని మెగా ఇండస్ట్రియల్ హబ్ లో గతంలో ఆమోదించిన ప్రదేశానికి బదులుగా అమరావతిలో రెండో ఎంఎస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్ (టీసీ) కమ్ టెస్టింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఆర్ డీఏ ద్వారా రాజధాని ప్రాంతంలో 20 ఎకరాల భూమిని అందజేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫ్రాక్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.కమ్యూనిటీ స్థాయిలో సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు మంత్రి మండలి ఆమోదించింది.

ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపారు. మాజీ సైనికులు, యుద్ధ వికలాంగ సైనికులు, యుద్ధ వితంతువులు, మాజీ సైనిక వితంతువులు మరియు వారిపై ఆధారపడినవారి స్వయం సమృద్ధి, సహాయ, పునరావాసానికై సొంత పిడిఎఫ్ ఖాతా నుండి రూ.3 కోట్ల కార్పస్ నిధితో ఆంధ్రప్రదేశ్ ఎక్స్-సర్వీస్మెన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి చేసిన ప్రతిపాదనకు స్పందించిన ముఖ్యమంత్రి రూ.10 కోట్ల కార్పస్ నిధి ఏర్పాటుకు ఆయన ఆమోదం తెలిపారు.



విజన్ డాక్యుమెంట్ వికసిత్ ఆంధ్ర 2047 పేరును స్వర్ణాంధ్ర ఏ 2047గా మార్చడానికి చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 21 నుండి అక్టోబర్ 5 వరకు స్టేక్ హోల్డర్స్ సంప్రదింపుల అనంతరం 1 నవంబర్, 2024న విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది.

కృత్రిమ మేధ, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అమరావతిలో ఏఐ యూనివర్సిటీ, స్కిల్లింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఎస్.ఆర్.ఎం.యూనివర్శిటీని యు.జి.సి. నిబంధనలు-2023 ప్రకారం డిస్టింక్టు కేటగిరీలో "డీమ్డు టు బి యూనివర్శిసిటీ" గా కన్వర్టు చేసేందుకు అవసరమైన "నో అబ్జక్షన్ సర్టిఫికేట్"ను ప్రభుత్వ పరంగా జారీచేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

నాలెడ్జ్ జనరేషన్ మరియు అప్లికేషన్ కేంద్రాలతో స్మార్ట్ & ఫ్యూచరిస్టిక్ సిటీగా రాజధాని అమరావతి నిర్మించేలా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. సవాళ్లు మరియు అవకాశాలకనుగుణంగా నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సిద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిభ అభివృద్ధి, స్టార్టప్ ఇంక్యుబేషన్, అత్యాధునిక పరిశోధనలు, బాధ్యతా యుతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానాలను ప్రోత్సహించడానికి ముందుకు వచ్చే పలు విద్యాసంస్థలకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నది.

దేశంలో పేరెన్నికగన్న పది ఉత్తమ విశ్వవిద్యాలయాలను ఆంధ్రప్రదేశ్‌కు తేవడం తమ లక్ష్యమని, బిట్స్ పిలానీ సంస్థ తమ అనుబంధ సంస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత ఏర్పాటు చేసేందుకు సంసిద్ధ తెలిపిందని ముఖ్యమంత్రి తెలిపారు.

రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమల్లో భాగంగా రాష్ట్రంలోని బి.సి.లకు చట్టసభలో సమానమైన ప్రాతినిధ్యాన్ని కల్పించాలనే లక్ష్యంతో బి.సి.లకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.ఈ మేరకు సంబంధిత ప్రతిపాదనలను కేంద్రం ఆమోదం కొరకు పంపేందుకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

బి.సి.లు ఆర్థికంగా వెనుకబడి ఉండటానికి కారణం రాజకీయ పరంగా వారికి తగిన అవకాశాలు లేకపోవడమేనన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

కౌలుదారు గుర్తింపు కార్డుల జారీ మరియు కొత్త కౌలు చట్టం, 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా "సాయిల్ హెల్త్ కార్డుల జారీ మరియు 2024-25లో "పొలం పిలుస్తోంది" కార్యక్రమంపై స్టేటస్ నోట్ను మంత్రి మండలి ఆమోదించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం జాతీయ ప్రాజక్టులో బాగమైన ఎర్త్ కమ్ రాక్ఫిల్ డ్యామ్ (ఇసిఆర్ఎఫ్) గ్యాప్ 2 పనుల్లో భాగంగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను ప్రస్తుతం ఉన్న ఏజన్సీ తోనే కొనసాగించేందుకు పోలవరం చీఫ్ ఇంజనీరు ప్రతిపాదించిన రాటిఫికేషన్ ఆర్డర్స్ కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం కారణంగా ఉత్పన్నమయ్యే అదనపు పనులను పారదర్శక బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా పనులను నిర్వహించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

రాయలసీమలో ఉన్న అన్ని రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను ఈ సీజన్ లోనే నింపేవింధగా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రంగా మార్పు ఇప్పటికే జారీ చేసి జి.ఓ.ను ర్యాటిపై చేస్తూ మంత్రి ఆమోదం తెలిపింది. నూతన ఎక్సైజ్ పాలసీ అమలుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అక్టోబరు మొదటి వారం నుండి ఈ నూతన పాలసీ అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ధరలు, రిటైల్ వ్యాపారం, పన్నులపై కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సులను మంత్రి మండలి ఆమోదించింది. ఐఎంఎఫ్ఎల్, ఎఫ్ఎల్ వాణిజ్య నియంత్రణ చట్టం - 1993కు తగిన సవరణలు చేయాలని చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

ఈ నూతన మద్యం పాలసీ లో నిర్వహణ, ఆదాయ సామర్థ్యాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా మద్యం అమ్మకాల కోసం ప్రైవేట్ రిటైల్ విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ నూతన విధానం రెండేళ్ల కాలపరిమితిని కలిగి ఉంటుంది, దీంతో రిటైలర్ల ఎక్కువ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంటుంది.సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత పట్ల ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న దుకాణాల్లో 10 శాతం గీత కులాలకు కేటాయించడం జరుగుతుంది.

రాష్ట్రంలోని 3,736 దుకాణాల్లో గీత కులాలకు 10% దుకాణాలను అంటే 340 దుకాణాలను కేటాయించడం జరుగుతుంది. ఈ రిజర్వుడ్ షాపులకు ప్రత్యేక మార్గదర్శకాలు, నోటిఫికేషన్లు జారీ చేయడం జరుగుతుంది. అన్ రిజర్వ్ డ్ షాపులకు ప్రతిపాదిత శ్లాబుల్లో 50 శాతం లైసెన్స్ ఫీజు ఉంటుంది. తద్వారా కల్లుగీత వర్గాలకు సామాజిక న్యాయం మరియు ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడుతుంది.

రిటైల్ మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండేందుకై లాటరీ ప్రాతిపదికన దుకాణాల కేటాయింపు పద్ధతిని అనుసరించడం జరుగుతుంది.తక్కువ ధరకే నాణ్యమైన పలు రకాల మధ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144